
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

శనివారం 5 జూలై 2025







మార్చ్‌పాస్ట్ చేస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వు హోమ్‌గార్డులు (ఇన్‌సెట్‌లో) గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ గంగాధరరావు

నెమ్మదిగా సాగు

ఖరీఫ్‌పై అన్నదాతల్లో కలవరం

జూలై ప్రారంభమైనా కరుణించని వరుణుడు

- జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వేడిగాలులు
- ఎదుగుదల లోపించిన వరిపైరు
- కాల్వ ఎగువ ప్రాంతాల్లో వరినాట్లు ప్రారంభం
- వర్షం కురిస్తేనే సాగుకు అనుకూలం
- సాగునీరు కూడా అరకొరగానే విడుదల
- శివారు ప్రాంతాలకు ఇంకా చేరని నీరు
- ఆకాశంవైపు చూస్తున్న అన్నదాతలు



ఒవైపు వరుణుడి కరుణ లేకపోవడం, మరోవైపు కాల్వలకు సరిగ్గా సాగునీరు విడుదల కాకపోవడం.. వెరసి ఈ ఏడాది ఖరీఫ్‌పై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూలై ప్రారంభమైనప్పటికీ వర్షాలు కురవకపోవడంతో నారుమడుల్లో ఎదుగుదల లోపించడం, అరకొర సాగునీరు శివారు ప్రాంతాలకు సరిగ్గా చేరకపోవడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో అన్నదాతలు అయోమయంతో ఆకాశంవైపు చూస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మే నెలలో 10 రోజుల పాటు కురిసిన వర్షం, ఆ తరువాత ముఖం చాటేసింది. జూన్ ప్రారంభం నుంచి వర్షాలు సక్రమంగా కురుస్తాయని రైతులు ఆశించినా నిరాశే మిగిలింది. జూలైలో వర్షాలు కురవకపోగా, ఉష్ణోగ్రతలు పెరిగి వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో నారుమడులలో ఎదుగుదల లోపించింది. నాట్లు వేసిన పొలాల్లో వరిపైరు బతకడానికి సమయం పడుతోంది. కాల్వలకు అరకొరగా నీటి విడుదల జరుగుతుండటంతో వాతావరణం సాగుకు ఎప్పటికి అనుకూలంగా మారుతుందోనని, వరుణుడు ఎప్పుడు కరుణిస్తాడోనని రైతులు ఆశగా చూస్తున్నారు.

సక్రమంగా విడుదల కాని సాగునీరు

గతనెల 23 నుంచి జిల్లాలోని అన్ని ప్రధాన కాల్వలకు పుష్కలంగా సాగునీరు విడుదల చేస్తామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కానీ, పూర్తిస్థాయిలో నీటి విడుదల జరగలేదు. 1.25 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీటిని సరఫరా చేసే బందరు ప్రధాన కాల్వకు పూర్తిగా సాగునీరు విడుదల కాలేదు. మచిలీపట్నం శివారు భూములకు ఇంకా నీటి విడుదల జరగనేలేదు. నీటి విడుదలకు ఇంకా రెండు రోజులు పడుతుందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. దివిసీమకు సాగునీటిని సరఫరా చేసే మిగతా 6లో..

వరినాట్లు వేగవంతం

ఈ ఖరీఫ్ సీజన్‌లో 1.62 లక్షల హెక్టార్లలో వరిసాగు జరుగుతుందని అంచనా. కంకిపాడు, ఉయ్యూరు, మొవ్వ, చల్లపల్లి, మోపిదేవి, పామర్రు, తోట్లవల్లూరు, ఘంటసాల, పెనమలూరు తదితర మండలాల్లో బోరునీటి ఆధారంగా పోసిన నారుమడులు సిద్ధం కావడంతో వరినాట్లు వేసే పనులు వారం రోజులుగా సాగుతున్నాయి. కాల్వలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తే బందరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు, కోడూరు, అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, నాగాయలంక తదితర మండలాల్లో నారుమడులు పోయడం, వెదజల్లే పద్ధతిలో వరినాట్లు వేయడం చేస్తారు. కాల్వలకు సరిపడా సాగునీరు విడుదల కాకపోవడంతో మోపిదేవి మండలం శివరామపురం, పెదప్రోలు తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీల్లో అందుబాటులో ఉన్న నీటిని తోడి సాగుకు ఉపయోగిస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఎగువ ప్రాంతంలో సాగునీటి వినియోగం తగ్గి, దిగువ ప్రాంతానికి నీరు విడుదల అవుతుందని రైతులు చెప్పుకొంటున్నారు.

పోలీసుల సంక్షేమానికే పెద్దపీట

దర్బార్ మార్చ్‌పాస్ట్‌లో ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రేయనక, పగలనక, ఎండనక, వాననక పనిచేస్తున్న పోలీసుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వు స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు, హోమ్‌గార్డ్స్ దర్బార్ పరేడ్ శుక్రవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగింది. పరేడ్ కమాండర్ అడ్మిన్ ఆర్‌ఐ రాఘవయ్య నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ వెంకటేశ్వరరావు నిర్వహించిన ఈ పరేడ్‌ను ఎస్పీ తిలకించారు. పోలీసులు రోజూ వ్యాయామం, యోగా, వాకింగ్, జాగింగ్, స్పోర్ట్స్‌లో పాల్గొనాలన్నారు. హెల్త్ చెకప్‌ల కోసం మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. సర్వీసు పుస్తకాల్లో గుడ్ సర్వీసు ఎంట్రీ, రివార్డులు నమోదు చేయించుకోవాలన్నారు. ముద్దాయిల ఎస్కార్ట్, వీఐపీ డ్యూటీల సమయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు రవికిరణ్, రవికుమార్, రాఘవయ్య పాల్గొన్నారు.

రాకీ యజమాని ఎక్కడ?

నాన్ బెయిలబుల్ వారెంట్‌తో పరార్

- వేణు రామయ్య, గుర్రం నాని మధ్య డీల్ ఏంటి?
- రెరా నిబంధనల ప్రకారం లేని ఒప్పందం
- బయటకు వస్తున్న సౌదీ బాధితులు
- ఎన్ఆర్ఐ సెల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు
- కొనుగోలుదారులపై గుర్రం నాని దౌర్జన్యం.. బూతులు



'చంద్రిక అయోధ్య' అపార్టుమెంట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : చంద్రిక అయోధ్య గ్రూప్ అపార్ట్‌మెంట్ల అసలు యజమాని, రాకీ అవెన్యూస్ అధినేత వేణు ఆచూకీ ఇంకా లభించలేదు. కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ ఇచ్చినప్పటి నుంచి ఆయన పరారీలోనే ఉన్నారని తెలుస్తోంది. రాకీ స్థానంలో విశ్వసంస్థ పేరుతో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుయాయుడు, టీడీపీ నేతపై దాడి కేసులో నిందితుడిగా ఉన్న గుర్రం నాని వచ్చి చేరారు. పొజిషన్ చూపకుండా, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వకుండా మెయింటినెన్స్ పేరుతో రూ.లక్షలు డిమాండ్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బాధితులంతా ఒక్కొక్కరుగా పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. బాధితులు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు సౌదీలో కూడా ఉన్నారు. తాము మోసపోయామంటూ ఏపీ ఎన్ఆర్ఐ సెల్‌కు ఫిర్యాదు చేయాలని చూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ ఎన్ఆర్ఐ సెల్ ద్వారా ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని సౌదీ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీల్ ఏంటి?

రాకీ అవెన్యూస్‌కు మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) వేణు రామయ్య. ప్లాట్ల కొనుగోలుదారులతో ఈయనే ఒప్పందాలు చేసుకున్నారు. అయితే, కొనుగోలుదారులు తమ ఇళ్లను స్వాధీనం చేసుకునే క్రమంలో విశ్వసంస్థ తరఫున గుర్రం నాని రంగంలోకి దిగాడు. కొనుగోలుదారుల నుంచి డబ్బు డిమాండ్ చేస్తుండటంతో అసలు రామయ్య, నాని మధ్య ఏం ఒప్పందం జరిగిందో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన వారిలో గుర్రం నాని కూడా ఒకరని తెలుస్తోంది. దీనిని బట్టి చూస్తే.. నాని ఇచ్చిన భూమికి మాత్రమే ఆయన హక్కుదారుడిగా ఉంటాడు. కానీ, మొత్తం ప్లాట్లకు వేణు రామయ్య ఎలా హక్కులు కల్పించారన్నది అనుమానంగా ఉంది. నాటి మిగతా 6లో..

రెరా నిబంధనలేవీ?

రాకీ అవెన్యూస్, విశ్వసంస్థ మధ్య డీల్ సక్రమంగా లేదని తెలుస్తోంది. వ్యక్తిగతంగా వారిద్దరి మధ్య ఎలాంటి ఒప్పందాలు జరిగాయో తెలియదు. కానీ, రెరా చట్టం ప్రకారం ఒక సంస్థ చేపట్టిన ప్రాజెక్టును మరో సంస్థ తీసుకోవాలంటే, కచ్చితంగా మొదటి సంస్థ కొనుగోలుదారులందరినీ సమావేశపరిచి ఆ విషయాన్ని తెలియజేయాలి. కొనుగోలుదారులతో కుదుర్చుకున్న ఒప్పందాలను ఆ సంస్థ కొనసాగిస్తుందని చెప్పి వారి ఆమోదం తీసుకోవాలి. కొనుగోలుదారులంతా అంగీకరిస్తేనే మరో సంస్థకు బాధ్యతలు అప్పగించాలి. కానీ, చంద్రిక అయోధ్య విషయంలో అలాంటిదేం జరగలేదు. రాకీ అవెన్యూస్ ఎండీ వేణు రామయ్య కొనుగోలుదారులకు ఈ విషయాన్నే చెప్పలేదు. ఆమోదం తీసుకోలేదు. రెరాలోనూ రిజిస్ట్రేషన్ జరగలేదు. కాబట్టి ఈ రహస్య ఒప్పందం చట్టబద్ధం కాదని అర్థమవుతోంది.



వృద్ధుడి సమస్యకు కలెక్టర్ పరిష్కారం

మచిలీపట్నం టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నందివాడ మండలం పుట్టగుంట గ్రామానికి చెందిన 80ఏళ్ల వృద్ధుడు సత్యనారాయణరెడ్డి సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ డీకే బాలాజీ ముందుకొచ్చారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన '80 ఏళ్ల వయసులో ఎంత కష్టం' అనే వార్తకు కలెక్టర్ స్పందించారు. వృద్ధుడిని శుక్రవారం తన కార్యాలయానికి పిలిపించుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే నందివాడ మండలం తహసీల్దార్ గురుమూర్తిని, సత్యనారాయణరెడ్డి కుమారుడు విశ్వనాథవరప్రసాదరెడ్డిని శుక్రవారం కార్యాలయానికి పిలిపించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని విశ్వనాథవరప్రసాదరెడ్డికి కలెక్టర్ హితబోధ చేశారు. కుమారుడు.. వృద్ధుడిపై దాడి చేసినా, సంరక్షణ బాధ్యతలు తీసుకోకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ గురుమూర్తిని ఆదేశించారు. కాగా, బాధితుడు సత్యనారాయణరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

లెక్క తేలింది

అద్విక టర్నోవర్ రూ.384 కోట్లు

- రూ.300 కోట్ల వరకు చెల్లింపులు
- రూ. 84 కోట్ల బకాయిలు
- లెక్కలు తేల్చిన పోలీసులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రూ.లక్ష పెట్టుబడి పెడితే.. నెలకు రూ.6 వేల వడ్డీ ఇస్తానని చెప్పి వందల మంది నుంచి రూ.కోట్లు వసూలు చేసిన అద్విక ట్రేడింగ్ కంపెనీ అసలు లెక్కలను పోలీసులు తేల్చారు. మొత్తం రూ.384 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. కొద్దిరోజులుగా అద్వికలో పెట్టుబడులు పెట్టిన ఏజెంట్లు, ఖాతాదారుల వివరాలను పోలీసులు సేకరిస్తున్న విషయం తెలిసిందే. బాధితుల నుంచి ఫిర్యాదులు కూడా తీసుకుంటున్నారు. ఏజెంట్లను విచారణ చేసి పెట్టుబడులు, చెల్లింపుల లెక్కలను తేల్చారు. తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య ఐదారేళ్ల నుంచి అద్విక కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఒకరి నుంచి ఒకరికి ఉన్న పరిచయాలను వేదికగా చేసుకుని పెట్టుబడులను ఆకర్షించాడు. కమీషన్లు భారీగా వస్తుండటంతో ఒకరిని చూసి మరొకరు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టారు. కొంతమంది రూ.కోట్లలోనూ పెట్టారు. ఆదిత్య బోర్డు తిప్పేసే సమయానికి 1,200 మంది నుంచి రూ.300 కోట్లు వసూలు చేశాడని బాధితులు చెప్పారు. పోలీసులు తేల్చిన లెక్కల్లో ఈ లెక్క దరిదాపుగా వచ్చింది. పెట్టుబడిగా రూ.384 కోట్లు వసూలు చేసిన ఆదిత్య కమీషన్ల రూపంలో రూ.300 కోట్ల వరకు చెల్లించాడని విశ్వసనీయంగా తెలిసింది.


బకాయిల నిర్ధారణ

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అద్వికలోకి పెట్టుబడులు భారీగానే వచ్చాయి. ఖాతాదారులకు, ఏజెంట్లకు ఆదిత్య రూ.84 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉందని నిర్ధారించినట్టు తెలిసింది. ఆదిత్యతో పాటు కార్యాలయంలో పనిచేసిన కిరణ్, కీర్తి భారీ మొత్తంలో వెనుకేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఎంవోయూ చేసి ఇచ్చిన రశీదులు, ఆన్‌లైన్ ద్వారా చేసిన చెల్లింపులను మిగతా 6లో..



జంతువులతో జాగ్రత్త..! 8

- రేబిస్ నివారణకు వ్యాక్సినేషనే మార్గం.. రేపే జూనోసిస్ డే



ఐదేళ్ల ఉద్యమం ఫలిస్తుందా?

- 11న జరిగే కౌన్సిల్ సమావేశం అజెండాలో పట్టాభి భవన నిర్మాణం

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ 6

- ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు



వేదాద్రి ఎత్తిపోతల పథకానికి చేతులెత్తి మొక్కుతున్న ఆయకట్టు రైతులు



ప్రణమిల్లుతున్నాం

- వేదాద్రి, కంచల ఎత్తిపోతలకు ఆయకట్టు రైతుల నమస్కారాలు
- ప్రభుత్వం ఆదుకుని సాగుకు అనుకూలంగా మార్చాలని వేడుకోలు

నందిగామ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటివరకు తమకు సాగునీరందించి జీవన ప్రమాణాల పెరుగుదలకు కారణమైన వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకానికి ఆయకట్టు రైతులు చేతులెత్తి మొక్కారు. పలు గ్రామాల రైతులు శుక్రవారం ట్రాక్టర్లపై వచ్చి పథకం పరిస్థితిని పరిశీలించారు. ప్రభుత్వ సాయంతో ఈ పథకం ఈ ఏడాది నుంచైనా పనిచేయాలని కోరారు. చాలాకాలం తరువాత పథకంలోని మోటార్లను, ప్యానల్ బోర్డులను పరిశీలించిన మిగతా 6లో..

ఇదేం తీరు?

పిల్లల ప్రాణాలు పణంగా పెట్టి నిర్మాణాలా?

- మోపిదేవి ఆశ్రమ పాఠశాలలో నాడు-నేడు పనులు
- ఇంజనీరింగ్ అధికారులు వద్దన్నా పాఠశాలపై ట్యాంక్ నిర్మాణం
- పనులు నిలిపివేయాలన్న విద్యాశాఖ ఆదేశాలు బేఖాతరు





అంతంతమాత్రంగా ఉన్న పాఠశాల భవనం (ఇన్‌సెట్‌లో) భవనంపై నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్

మోపిదేవి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి మండలంలోని మోదుమూడి ఆశ్రమ పాఠశాలలో మన బడి-మన భవిష్యత్ పనులు వివాదాస్పదంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా మనబడి-మన భవిష్యత్ (నాడు-నేడు) పనులు ఏ స్థితిలో ఉన్నా నిలిపివేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ గతనెల 27న అన్ని జిల్లాల కలెక్టర్లకు, మండల విద్యాశాఖ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను ధిక్కరిస్తూ వారం రోజులుగా పనులు నిరాటంకంగా సాగుతున్నాయి. పాఠశాలలో ప్రస్తుతం ఉన్న భవన సామర్థ్యం గట్టిగా లేదు. భవనంపై ఏ విధమైన నిర్మాణాలు చేపట్టరాదని ఇంజనీరింగ్ అధికారులు లిఖితపూర్వకంగా లేఖలు అందించినా ధిక్కరిస్తూ, పిల్లల ప్రాణాలు పణంగా పెట్టి కాంక్రీట్ వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నారు. మోపిదేవి సచివాలయ ఇంజనీరింగ్ అధికారులు విషయం తెలుసుకుని శుక్రవారం పాఠశాలకు వెళ్లారు. తక్షణమే పనులు నిలిపివేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.గోపాల్, ఎంఈవో-2 అన్నపరెడ్డి పిచ్చియ్యకు లేఖను అందించారు.

హడావిడి పనులపై అనుమానాలు

ఈ ఆశ్రమ పాఠశాలలో 2022, సెప్టెంబరు 17న రూ.51 లక్షలతో నాడు-నేడు రెండో విడత పనులకు శంకుస్థాపన చేశారు. 2022లో నిధులు మంజూరు కాగా, టాయిలెట్ బ్లాక్, డ్రింకింగ్ వాటర్, మేజర్, మైనర్ పనులు, విద్యుదీకరణ, ఫర్నిచర్ ఏర్పాటు, గ్రీన్ బోర్డు పెయింటింగ్ పనులు చేయాల్సి ఉంది. టాయిలెట్ బ్లాక్, వంటగది పనులు 50 శాతమే పూర్తయ్యాయి. పాఠశాలలో రెండున్నరేళ్లుగా ప్రధానోపాధ్యాయుడిగా ఉంటూ ఎంఈవోగా బాధ్యతలు నిర్వహించిన దుర్గాసాగర్ ఇటీవల మిగతా 6లో..

బదిలీల గందరగోళం!

- కొండప్రాంతాల్లో వికలాంగులకు పోస్టింగ్‌లు
- ఆప్షన్లు తీసుకుని అడ్డగోలుగా బదిలీ చేశారు
- కమిషనర్ చాంబర్ వెలుపల బైఠాయించిన సచివాలయ ఉద్యోగులు

కార్పొరేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు గందరగోళంగా మారాయి. అధికారులు ఇష్టానుసారం బదిలీలు చేశారంటూ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం విజయవాడ మున్సిపల్ కమిషనర్ చాంబర్ వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. నగర పరిధిలోని ఉద్యోగుల నుంచి ఆప్షన్లు తీసుకొని అడ్డదిడ్డంగా బదిలీలు చేశారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. రెండ్రోజులుగా వీఎంసీ చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నా అధికారులు తమను కలవన్వీటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ బదిలీలతోపాటు దివ్యాంగుల బదిలీలూ అడ్డదిడ్డంగా చేశారని, దివ్యాంగులను కొండప్రాంతాల్లో సచివాలయాలకు బదిలీచేస్తే ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. బదిలీలు జీవోకు విరుద్ధంగా ఉన్నాయని, కౌన్సిలింగ్ లేకుండా నేరుగా బదిలీలు చేశారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఐదేళ్ల పూర్తికాని ఉద్యోగులను బలవంతంగా బదిలీ చేశారని, జీఎస్‌డబ్ల్యూఎస్‌శాఖ సర్క్యులర్ ప్రకారం కౌన్సిలింగ్ జరగలేదని ఉద్యోగులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కౌన్సిలింగ్ లేకుండా జరిగిన బదిలీ ఉత్తర్వులను పునఃపరిశీలించి తమకు న్యాయం చేయాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.


కమిషనర్ కార్యాలయం వెలుపల నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు


దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం శుక్రవారం దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అభక్తులు పొంగళ్లు సమర్పించారు. భక్తులకు సులభతరంగా అమ్మవారి దర్శనం జరగాలని ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రోటోకాల్ దర్శనం నిలిపివేసి సామాన్య భక్తులను అనుమతించాలని ఈవో శీనానాయక్ ఆదేశించారు. క్యూలైన్లలో పరిస్థితిని, భక్తుల రద్దీని క్రమబద్ధీకరించారు. తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు భక్తి శ్రద్ధలతో అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈవో అన్ని ఏర్పాట్లు చేశారు.


వారాహి నవరాత్రుల పూర్ణాహుతి పూజల్లో ఈవో శీనానాయక్

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు

దేవస్థానంలో జూన్ 26 నుంచి ప్రారంభమైన వారాహి నవరాత్రులు శుక్రవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. ఈ సందర్భంగా దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, వేద పండితులు, అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో వీకే శీనానాయక్ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు, పూలు, పండ్లు వేదపండితులు, అర్చకస్వాములు పూర్ణాహుతిలో సమర్పించారు.


దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్త బృందాలు

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించిన భక్తబృందాలు

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ చేసి మొక్కులు తీర్చుకోవడానికి శుక్రవారం పెద్ద ఎత్తున భక్తబృందాలు తరలి వచ్చాయి. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారికి స్వాగతం పలికారు. భక్త బృందాలకు ఉచిత దర్శనం ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు. ఆషాఢ శుక్రవారం కావటంతో భక్త బృందాలు పెద్దఎత్తున తరలివచ్చాయి. అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం మహామండపం 6వ అంతస్తులో భక్తులకు సామూహిక ఆశీర్వచనం, ఉచిత ప్రసాదం అందజేశారు.

ఆశ్రమ పాఠశాలలో చలసాని జన్మదినం

- ఇద్దరు చిన్నారుల దత్తత


ఆశ్రమ పాఠశాల చిన్నారులతో చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు శుక్రవారం తన జన్మదిన వేడుకను దివ్యాంగుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి చిన్నారులకు శుభాశీస్సులు అందజేశారు. అనంతరం ఇరువురు అనాధ చిన్నారులను దత్తత తీసుకుంటున్నట్టు, వారి ఆలన పాలన తానే చూస్తానని నిర్వాహకులు మాధవీలత, వెంకటస్వామిలకు చెప్పారు. ముందుగా వేంకటేశ్వర స్వామి, అభయాంజనేయస్వామిని దర్శించి పూజలు చేశారు. అనంతరం స్థానిక విజయవాడ రోడ్డులో కాకాని కల్యాణ మండపంలో మిత్రులు, ఆత్మీయులు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షులు, జంక్షన్ పాలశీతల కేంద్రం సిబ్బంది ఏర్పాటు చేసిన వేడుకలో చలసాని పాల్గొన్నారు. కార్యక్రమంలో కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా బోర్డు డైరెక్టర్ శనగల వెంకట శివజ్యోతి, ఫీడ్ కమిటీ సభ్యులు పిన్నమనేని లక్ష్మీప్రసాద్, టీడీపీ నాయకులు యలమంచలి శ్రీరామచంద్రమూర్తి, గుండపనేని ఉమావరప్రసాద్, రైతు నాయకులు నందూరు సత్యవెంకటేశ్వరశర్మ,పాలకేంద్రం మేనేజర్ హరిబాబు, సంఘాల అధ్యక్షులు, సిబ్బంది తదితరులు పాల్గొని చలసానికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.


ఫొటో ట్రేడ్‌షోను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు బోడెప్రసాద్, గద్దె రామ్మోహన్

ఫొటోలు తరతరాల చారిత్రక దృశ్యాలు

- ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్

పెనమలూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఫొటోలు తరతరాలకు గుర్తుండిపోయే చారిత్రక దృశ్యాలని ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్‌లు అన్నారు. శుక్రవారం కానూరు మన కళ్యాణమండపంలో జరిగిన ఏపీ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటో ట్రేడ్ షో కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు స్టాల్స్‌లో కెమెరాలు, ఫొటో పరికరాలను పరిశీలించారు. ఏ కార్యక్రమమైనా దానిలో ఫొటోగ్రాఫర్ పాత్ర కీలకమని పేర్కొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ, ఫొటో ట్రేడ్‌షో ఫొటోగ్రాఫర్లకు ఒక పండుగలాంటిదని తెలిపారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అత్యాధునిక కెమెరాలు, లెన్సులు, ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి

- విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని


ఎంపీ కేశినేని చిన్నికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

రైల్వేస్టేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే కార్మికుల, కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల, కాలనీల సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించేందుకు శుక్రవారం కేఎస్ఎన్ మూర్తి భవన్‌లో సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోక్‌సభలో విజయవాడ, శాటిలైట్ స్టేషన్ల అభివృద్ధిపై పలుమార్లు ప్రస్తావించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. విజయవాడ నగరపాలక సంస్థ, రైల్వే అధికారులను సమన్వయపరచి రైల్వేశాఖతో ముడిపడి ఉన్న మురుగునీటి పారుదల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ లీలా మాట్లాడుతూ, కాలనీలలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీని కోరారు. హింద్ మజ్దూర్ సభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి.ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ, డివిజన్‌లో రైల్వే క్వార్టర్స్ ఉపయోగంలోకి వచ్చి సుమారు 50 సంవత్సరాలు పూర్తయినప్పటికీ కనీసం మరమ్మతులు కూడా చేయటం లేదన్నారు. అనంతరం రైల్వే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాన్ని ఎంపీకి అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ కోశాధికారి ఆర్.ఎం.లక్ష్మి, టీడీపీ నాయకులు తూమాటి ప్రేమనాథ్, వి.నరసింహచౌదరి, కాపు మల్లికార్జున్ యాదవ్, మజ్దూర్ యూనియన్ డివిజనల్ ప్రెసిడెంట్ రామగుప్తా, సహాయ కార్యదర్శులు జోనల్ కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాతవాహన అక్రమాలపై చర్య తీసుకోండి

- కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌లపై ఏసీపీకి ఫిర్యాదు


శాతవాహన కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

గవర్నర్‌పేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన కళాశాల నిర్వహణలో అక్రమాలపై ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌లను బాధ్యులు చేస్తూ చర్యలు తీసుకోవాలని కళాశాల సిబ్బంది ఏసీపీకి ఫిర్యాదు చేశారు. కళాశాలలో ఎయిడెడ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ జీతాలు పొందుతున్న తమ సంతకాలు ఫోర్జరీ చేసి, నకిలీ వ్యక్తుల్ని రాష్ట్ర విద్యాశాఖకు చూపి తమను తొలగించే ప్రయత్నాలు చేస్తున్న ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణలపై చర్యలు తీసుకోవాలని కళాశాల సిబ్బంది శుక్రవారం ఏసీపీకి ఫిర్యాదు చేశారు. అనంతరం కళాశాల గేటు వద్ద సిబ్బంది నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్, భౌతిక శాస్త్ర అధ్యాపకులు జేవీ సత్యనారాయణ మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి వచ్చే నగదు విషయంలో ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ బ్లాక్‌మెయిల్ చేయడం, లంచం తీసుకోవడంపై అనేక ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సిబ్బందికి జీతాలు అందకుండా అయోమయం సృష్టిస్తున్నారని, విద్యార్థులకు ఫోన్‌లు చేసి టీసీలు తీసుకువెళ్లిపోవాలని చెబుతూ భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. అధికారులు జోక్యం చేసుకుని సిబ్బంది, విద్యార్థుల భవితను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల బోధనేతర సిబ్బంది సంగీతరావు, బ్రహ్మయ్య, యశోద, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలు పునరుద్ధరిస్తాం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కంచికచర్ల రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా ప్రభుత్వ వాగులు, కాలువలను ఆక్రమించి పూడ్చినట్టు నిర్ధారణ అయితే వారిపై చర్యలతో పాటు వాటిని పునరుద్ధరిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ రైతులకు హామీ ఇచ్చారు. పరిటాల గ్రామంలో కాచేటి వాగు, ఎన్ఎస్పీ కాలువల పూడ్చివేతలపై ఆయన స్పందించారు. పరిటాల గ్రామంలో రోడ్డుపై టెంట్లు వేసుకొని మూడురోజులుగా దీక్ష చేస్తున్న రైతులతో ఆయన మాట్లాడారు. అనుమతులకు మించి తవ్వకాలు జరిపే క్వారీ యజమానులపై చర్యలుంటాయన్నారు. ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. పలువురు రైతులపై క్వారీ యజమానులు పెట్టిన అక్రమ కేసులు తొలగించే వరకు దీక్షలు కొనసాగిస్తామని రైతులు పేర్కొన్నారు. రాతి క్వారీల పరిసర ప్రాంతాలలో కిలో మీటర్ వరకు బఫర్ జోన్‌గా ప్రకటించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదేం తీరు?

(5వ పేజీ తరువాయి)

ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతన ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌కు నాడు-నేడు పనుల బాధ్యతలు చేపట్టడంలో కొంతమేర జాప్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ కమిషన్ ఆదేశాలను ఉల్లంఘిస్తూ ప్రస్తుత భవన సామర్థ్యాన్ని పట్టించుకోకుండా పనులు చేపట్టారు. గతంలో నిధులు డ్రా చేశామని, ఆ పనులు ఇప్పుడు చేస్తున్నామని పాఠశాలలో సమాధానమిచ్చారు. ఏడాది క్రితమే లక్షల రూపాయలు డ్రా చేసి.. ప్రస్తుతం బాధ్యతలు అప్పగించే సమయంలో హడావిడిగా పనులు చేయటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తల్లిదండ్రుల ఆగ్రహం

ప్రస్తుతం పాఠశాల ఉన్న భవన సామర్థ్యం సరిగ్గా లేదు. 20 ఏళ్ల క్రితం నాటి భవనం.. అంతంతమాత్రంగా ఉండగా, దానిపై అదనపు కట్టడాలు ఎలా అనుమతించారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిధుల్లో అవకతవకలు, ఉన్నతాధికారుల ఆదేశాలు ధిక్కరించి చేపడుతున్న పనులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

రాకీ యజమాని ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

వైసీపీ ప్రభుత్వ రాజకీయ బెదిరింపుల కారణంగా అప్పగించారా? వైసీపీ నేతలతో చేతులు కలిపి కొనుగోలుదారుల నుంచి డబ్బు పిండుకునేందుకు ఎత్తుగడ వేశారా? అన్నది తెలియాల్సి ఉంది.

కొనుగోలుదారులపై గుర్రం నాని దౌర్జన్యం

కొనుగోలుదారులపై గుర్రం నాని దౌర్జన్యాలకు తెగబడుతున్నాడు. రాకీ అవెన్యూ ప్రాజెక్టులోనే ఆఫీసు ఏర్పాటు చేసుకుని కొనుగోలుదారులతో మర్యాద లేకుండా మాట్లాడుతున్నాడు. బూతులు తిడుతున్నాడు. బదలాయింపునకు ఆధారాలేమిటో చూపించమని అడిగితే శివాలెత్తిపోతున్నాడు. చంద్రిక అయోధ్య ప్రాజెక్టు కోసం పలువురు తమ భూములను డెవలప్‌మెంట్ విధానంలో రాకీ అవెన్యూస్‌కు ఇచ్చారు. ఫలితంగా వారికి ఇవ్వాల్సిన ప్యాకేజీ విషయంలో కూడా రాకీ అవెన్యూస్ హ్యాండిచ్చింది.

లెక్క తేలింది

(5వ పేజీ తరువాయి)

మాత్రమే పోలీసులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఆ గణాంకాలన్నీ తీయగా రూ.84 కోట్ల బకాయిలు బయటపడ్డాయి. ఈ మొత్తం ఎక్కడ ఉందన్న వివరాలను ఆదిత్య నుంచి తెలుసుకుంటున్నారు. ఇప్పటికే డీసీపీ స్థాయి అధికారి విచారణ చేసినా ఆదిత్య నోరు మెదపలేదు. అధికారుల ముందు మాత్రం ఆదిత్యపై కిరణ్ చిందులు తొక్కుతున్నట్టుగా నటిస్తున్నాడు. ఆదిత్య నుంచి కిరణ్, కీర్తి భారీ మొత్తంలో వెనుకేసుకున్నారని తెలుస్తోంది. పెట్టుబడులు, చెల్లింపుల లెక్కలు తేలడంతో బాధితులకు ఏవిధంగా న్యాయం చేయాలన్న దానిపై అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నెమ్మదిగా సాగు

(5వ పేజీ తరువాయి)

కేఈబీ కాల్వకు 1,700 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా, 800 క్యూసెక్కులే విడుదల చేస్తున్నారు. పులిగడ్డ అక్విడెక్టు వద్ద గేట్లను ఎత్తి అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాలకు సాగునీటిని విడుదల చేశారు. కోడూరు, నాగాయలంక మండలాల్లోని కాల్వలకు 250 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ప్రధాన కాల్వలకు దగ్గరలోని భూముల్లో రైతులు నారుమడులు పోసే పనులు ప్రారంభించారు. బందరు కాల్వకు 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా, 1,150 క్యూసెక్కులే వదిలారు. వీరంకిలాకుల ఎగువన బందరు ప్రధాన కాల్వలో నాచు పెద్దఎత్తున పేరుకుపోవడంతో రెండురోజుల క్రితం వరకు తొలగింపు పనులు చేశారు. దీంతో బందరు కాల్వకు పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేయకుండా నిలిపివేశారు. ఈ కారణంగా బందరు కాల్వకు పూర్తిస్థాయిలో నీటి విడుదల జరగలేదు. శివారుకు ఇంకా సాగునీరు చేరలేదు. జిల్లాలో ఇప్పటివరకు వెదజల్లే పద్ధతిలో 10,600 హెక్టార్లలో వరినాట్లు రైతులు పూర్తి చేశారు. 800 హెక్టార్లలో వరినాట్లు వేశారు. 3,100 హెక్టార్లలో నారుమడులు పోశారు.

కోమటిగుంట లాకులకు మరమ్మతులు చేయరు

కంకిపాడు మండలంలోని పలు గ్రామాలకు, దిగువ ప్రాంతాలకు సాగునీటిని సరఫరా చేసే కోమటిగుంట లాకులు మరమ్మతులకు గురయ్యాయి. గత వేసవిలో ఈ లాకులకు కనీస మరమ్మతులు చేయలేదు. లాకులు సక్రమంగా పనిచేయకపోవడంతో దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేసే అవకాశం ఉండట్లేదు. ఇక్కడ 7.2 అడుగుల మేర నీటిమట్టం ఉంటే.. కంకిపాడు మండలంలోని పొలాలకు సాగునీటిని విడుదల చేసే అవకాశం ఉంటుంది. శుక్రవారం సాయంత్రం 6.3 అడుగుల మేర మాత్రమే నీటిమట్టం ఉంది. దీంతో నీటిని విడుదల చేసినట్లుగా కనిపిస్తున్నా పొలాల్లోకి పారని పరిస్థితి ఏర్పడింది. కాల్వ ద్వారా సాగునీరు సక్రమంగా అందకపోవడంతో కంకిపాడు మండలంలోని రైతులు బోరునీటిని తోడి వరినాట్లు వేస్తున్నారు. నాలుగైదు రోజులుగా వరినాట్లు వేగవంతమయ్యాయి. కోమటిగుంట లాకులు సక్రమంగా పనిచేసి నీటి విడుదల జరిగి, ఆశించిన స్థాయిలో వర్షం కురిస్తే, బోరునీటితో పని ఉండదని, బోర్లకు ఉపయోగించే విద్యుత్ కూడా ఆదా అవుతుందని రైతులు చెబుతున్నారు.

ప్రణమిల్లుతున్నాం

(5వ పేజీ తరువాయి)

అన్నదాతలు ఉద్వేగానికి గురయ్యారు. సాగునీటి పథకానికి మరమ్మతులు చేయించి ఆదుకోవాలని వారంతా ప్రభుత్వాన్ని కోరారు. మూడు రోజులుగా రైతులు వేద్రాద్రి, కంచల ఎత్తిపోతల పథకాల పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నారు. ఏ క్షణంలో నిధులు విడుదలైనా పనులు ప్రారంభించేలా తీర్చిదిద్దుతున్నారు. ఐదేళ్లుగా నిలిచిపోయి ఉన్న ఈ పథకంలో నాలుగు మోటార్లు ఉన్నాయి. వీటిలో ఒక మోటారుకు తాత్కాలిక మరమ్మతులు చేపడితే పనిచేసే అవకాశం ఉందని గతంలోని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే, విద్యుత్‌ను పునరుద్ధరించి సదరు మోటార్లను పరిక్షించాల్సి ఉంది. కనీసం ఒక మోటారు పనిచేసినా ఆయకట్టు రైతులు ధైర్యంగా సాగు ప్రారంభించుకోవచ్చు. ప్రజాప్రతినిధులు పథకం వైపు తిరిగి చూడకపోవడం తమను ఆవేదనకు గురిచేస్తోందని వారన్నారు. ఇటీవల పథకం పరిశీలనకు వచ్చిన ఎన్ఎస్పీ, ఐడీసీ అధికారులు తిరిగి అటువైపు చూడలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ఈ పథకంపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. నందిగామ డీసీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, కృష్ణామిల్క్ యూనియన్ డైరెక్టర్ నెలకుదిటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీపీటీడీలో ప్రమోషన్లకు అనుమతులివ్వాలి

కృష్ణలంక, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీటీడీలో దీర్ఘకాలికంగా ప్రమోషన్ల ప్రక్రియ ఆగిపోయినందున అన్ని కేటగిరీల ప్రమోషన్లకు ప్రభుత్వపరంగా త్వరితగతిన అన్ని అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పీవీ రమణారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, తదితరులు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును కలిసి విజ్ఞప్తి చేశారు. వివిధ అనారోగ్య కారణాలతో మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగులకు ఏపీఎస్ ఆర్టీసీలో వున్న విధంగా ప్రత్యామ్నాయ ఉద్యోగాలు, ఆర్థిక సౌలభ్యాలు ఇవ్వాలని కోరారు. ఈహెచ్ఎస్ వైద్యం స్థానంలో ఏపీఎస్ ఆర్టీసీలో పాత వైద్యవిధానాన్ని కొనసాగించాలని తెలిపారు.

కృష్ణానదిలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


గడ్డం అభిరామ్ మృతదేహం

వన్‌టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక స్టేషన్ పరిధి శనైశ్చరస్వామి దేవస్థానం సమీపంలో కృష్ణానదిలో ఈతకు దిగిన అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థి గడ్డం అభిరామ్ (18) మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందం నదిలో గాలించి అభిరామ్ మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం ఓబులనాయనపల్లి గ్రామానికి చెందిన చంద్రమోహన్ వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతని కుమారుడు అభిరామ్ గూడవల్లిలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ పాసయ్యాడు. కళాశాలలో సర్టిఫికెట్లు తీసుకోవటానికి స్నేహితులతో కలిసి గురువారం సాయంత్రం సొంతూరు నుంచి రైలులో విజయవాడ బయల్దేరారు. శుక్రవారం ఉదయం విజయవాడలో దిగి కృష్ణానదిలో స్నానం చేసి అమ్మవారి గుడికి వెళ్లి, ఆ తరువాత కళాశాలకు వెళ్లి సర్టిఫికెట్లు తీసుకుందామని స్నేహితులు అనుకున్నారు. ఆ ప్రకారం వారందరూ స్టేషన్ నుంచి నడుచుకుంటూ శనైశ్చర స్వామి ఆలయ సమీపంలోని నదిలో స్నానం చేయటానికి నీటిలో దిగారు. అయితే అభిరామ్ నదిలో కొంచెం దూరం వెళ్లటంతో ఈత రాక మునిగిపోయాడు. బ్యారేజి వద్ద ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందం, కృష్ణలంక పోలీసులు నదిలో గాలించి అభిరామ్ మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు అభిరామ్ తల్లిదండ్రులకు సమాచారం తెలియపరిచారు. అభిరామ్ స్నేహితుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రసాదరావు

మనుమడే మట్టుబెట్టాడు!

- హైమావతి హత్యకేసులో నిందితుల అరెస్టు

జి.కొండూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం సొంత నాయనమ్మనే మట్టుపెట్టిన మనుమడిని, అతడి స్నేహితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. జి.కొండూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో హత్య వివరాలను మైలవరం ఏసీపీ ప్రసాదరావు వెల్లడించారు. ఈనెల 1న ఉదయం 11.15 గంటలకు చెవుటూరు గ్రామంలోని పొలాల్లో ఉమ్మడి హైమావతి (65) అత్యంత దారుణంగా హత్యకు గురికాగా.. భర్త చలపతిరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ద్వారా అనుమానితుల కదలికలను గుర్తించామని, హతురాలి పెద్ద కుమారుడు కొడుకు వేణుగోపాల్ అతడి స్నేహితుడి సాయంతో ఈఘాతుకానికి పాల్పడినట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. ఆస్తి తగాదాల కారణంగా నాయనమ్మ, తాత చలపతిరావుల అడ్డు తొలగిస్తే ఆస్తి మొత్తం తమకే దక్కుతుందనే దురాశతో వేణుగోపాల్ పథకం ప్రకారం పరిటాలలో ఉంటున్న స్నేహితుడితో కలిసి మోటార్ బైక్‌పై చెవుటూరు వచ్చి పొలాల్లో గేదెలు మేపుతున్న నాయనమ్మ హైమావతిని కొట్టి హత్యచేశాడు. అనంతరం పెట్రోల్ పోసి నిప్పుపెట్టాడు. సీసీ కెమెరాల ఆధారంగా శుక్రవారం మైలవరం శివారు తిరువూరు రోడ్డులో నిందితులు వేణుగోపాల్, ఆకుల గోపిని అదుపులో తీసుకొని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కేసును మూడు రోజుల్లో చేధించిన సీఐ దాడి చంద్రశేఖర్, ఎస్ఐ సతీష్‌కుమార్‌లను అభినందించారు.


ప్రమాదంలో ధ్వంసమైన బస్సు ముందుభాగం

లారీని ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

- బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- ప్రయాణికులు సురక్షితం
- డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం

జి.కొండూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు లారీని ఢీ కొన్న ఘటనలో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో ఇద్దరు డ్రైవర్లు, లారీలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ 30వ జాతీయ రహదారిపై జి.కొండూరు-చెవుటూరు బైపాస్ రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హన్మకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హన్మకొండ నుంచి విజయవాడ వస్తు ఇబ్రహీంపట్నం నుంచి మైలవరం వైపు యూ పీవీసీ డోర్స్ లోడుతో వెళుతున్న లారీని వేగంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో బస్సు డ్రైవర్ హన్మకొండకు చెందిన జొన్నపురెడ్డి విజయ్‌కుమార్ (40)కాళ్లు విరిగిపోయాయి. అతడి వెనుక ఉన్న మరో డ్రైవర్ బుట్ల నరసింహారావుకు స్వల్ప గాయాలయ్యాయి. లారీక్యాబిన్‌లో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదసమయంలో బస్సులో ఉన్న 19 మంది ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. డ్రైవర్ నిద్ర మత్తే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో క్రేన్ సాయంతో లారీ క్యాబిన్‌కు ఇరుక్కుపోయిన బస్సును బయటకు తీసి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

పెనమలూరు

● పెనమలూరు ● గన్నవరం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

చెత్త సేకరణకు కొత్త రిక్షా బళ్లు

విజయవాడ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నున్నలో ఇంటింటా చెత్త సేకరణకు చెత్త సేకరణ కొత్త రిక్షాలను శుక్రవారం సర్పంచ్ కాటూరి సరళ జెండా ఊపి ప్రారంభించారు. రూ.3. 50 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 11 రిక్షాలను పంచాయతీ పారిశుధ్య విభాగం సిబ్బందికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఈవో సురేష్‌బాబు, టీడీపీ గ్రామాధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జండా ఊపి చెత్తసేకరణ రిక్షాలుప్రారంభిస్తున్న సర్పంచ్ కాటూరి సరళ, కలకోటి శ్రీనివాసరెడ్డి

రజక ఆకాంక్ష సభను జయప్రదం చేయండి

కానూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో 6న జరిగే రజక ఆకాంక్ష సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక కార్పొరేషన్ డైరెక్టర్ తాతపూడి గణేష్ కోరారు. శుక్రవారం కానూరులోని రజక సంఘం పెద్దలతో జరిగిన సమావేశంలో గణేష్ పాల్గొని మాట్లాడుతూ, ఏడాది కూటమి పాలనలో రజకుల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను గురించి ఈ సభలో చర్చించడం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో రజకులు పాల్గొన్నాలని కోరారు.

కాల్వలో పడిన యువకుడి మృతదేహం గుర్తింపు

ఉయ్యూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు 2వ తేదీ రాత్రి కాల్వలో కాలు జారి పడిన రెల్లికాలనీకి చెందిన రావులపూడి సాయి చంద్రశేఖర్ (25) మృతదేహం శుక్రవారం కాల్వలో లభ్యమైంది. చంద్రశేఖర్ కోసం గాలిస్తున్న కుటుంబ సభ్యులకు నగర పంచాయతీ రోడ్డులో కాల్వలో మృతదేహం కన్పించడంతో వెలికితీశారు. పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

గుణదల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఒకరు మృతి చెందినట్టు మాచవరం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. తాడేపల్లి మండలం తాడేపల్లికి చెందిన సాడు సుమంత్ రెడ్డి (28) నగరంలోని ఎనికేపాడులో గల ఓ షోరూమ్‌లో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతిరోజు డ్యూటీకి ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై వస్తుంటాడు. శుక్రవారం ఇంటి నుంచి డ్యూటీకి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రామవరప్పాడు రింగ్‌రోడ్డు వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన సుమంత్ రెడ్డిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం పోలీసులు తెలిపారు.

నకిలీ మద్యం మోసగాళ్లతో జాగ్రత్త

ఉయ్యూరు. జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు మద్యం సరఫరా చేస్తామని చెప్పి నకిలీ మద్యం విక్రయించే వారి వద్ద నుంచి కొనుగోలు చేసి మోసపోవడమే కాక అనారోగ్యానికి గురి కావొద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉయ్యూరు సీఐ శేషగిరిరావు సూచించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి వివరాలు ఎక్సైజ్‌శాఖకు సమాచారం టోల్ ఫ్రీ నంబరు 14405కి కాని, 9440902451 సెల్ నంబరుకు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు.



ఉంగుటూరులో సూర్యావతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మహిళా లోకానికి సూర్యావతి సేవలు చిరస్మరణీయం

ఉంగుటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యున్నతికి పాటుపడిన తొలితరం మహిళా నాయకురాలు కామ్రేడ్ మానికొండ సూర్యావతి అని, మహిళా లోకానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి అన్నారు. కామ్రేడ్ మానికొండ సూర్యావతి వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఉంగుటూరులోని మానికొండ సూర్యావతి శ్రామిక భవనంలో ఆ పార్టీశ్రేణులు నిర్వహించాయి. సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, నాయకులు రామ్మోహనరావు, సాంబశివరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేడు కానూరులో జగన్నాథ రథయాత్ర

కానూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఇస్కాన్ భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం కానూరులో జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవం జరగనుంది. ఈ రథయాత్రను సాయంత్రం సాయిగీత మందిరం వద్ద ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించనున్నారు. పంటకాలువ రోడ్డు, నాగార్జున హాస్పిటల్, ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు, బందరురోడ్డు మీదుగా ఆటోనగర్ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న శ్రీ సాయిబాబా కల్యాణ మండపం వరకు కొనసాగనున్నట్టు మందిరం అధ్యక్షుడు శ్రీమాన్ చక్రధరి దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఫస్ట్ ఇంటర్ విద్యార్థులు ఆధార్ లింక్ చేసుకోవాలి

గన్నవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యార్థులకు తల్లికి వందనం పథకానికి సంబంధించి ఈ నెల 10వ తేదీలోపు వారి ఖాతాల్లో నగదు జమ చేయనున్నారని ఏఎస్ డబ్ల్యూవో బి.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి పేరున బ్యాంక్ అక్కౌంట్‌కు ఆధార్ నెంబర్ లింక్ కాని వారు వెంటనే బ్యాంకుకు వెళ్లి లింక్ చేయించుకోవాలని సూచించారు.

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి

సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ వ్యాప్తంగా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. శుక్రవారం తాడిగడప రామ్‌నగర్ కట్టపై జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఏడాదిగా నియోజకవర్గంలో, రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తెలిపే కరపత్రాలను పంచిపెడుతూ ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు జువ్వాది రాంబాబు, టీడీపీ కూటమి నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, తాతపూడి గణేష్, సంగెపు రంగారావు, తుమ్మల రాంకుమార్, రాజారావు, పీతా గోపీచంద్, నర్రా చంటి, శివరాంప్రసాద్ పాల్గొన్నారు.

● పోరంకి ప్రభునగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద, లైఫ్ స్టయిల్ వెనుక భాగంలో 58లక్షల సాధారణ నిధుల వ్యయంతో నిర్మించనున్న డ్రైన్లనిర్మాణాలకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకరరావులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనరు షేక్ నజీర్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

● పెనమలూరులో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు టీడీపీ అధ్యక్షులు కోయ ఆనంద్‌ప్రసాద్, క్లస్టరు ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు తోటకూర ఉదయ భాస్కర్, షేక్ సుబాని, గూడవల్లి పూర్ణ, యలమంచిలి ప్రసాద్, చిగురుపాటి శ్రీనివాస్, అన్నవరపు నాగరాజు, జమ్ములు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిబిడ్డకు తల్లికి వందనం అమలు

ఉయ్యూరు : రాష్ట్రంలో బడికి వెళ్లి చదువుకునే ప్రతి ఒక్కరికి తల్లికి వందనం పథకం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు నగర పంచాయతీ 15వ వార్డులో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గుర్నాధరావు, అజ్మతుల్లా, రాజులపాటి ఫణి, చలపాటి శ్రీను, అప్పలనాయుడు, బూరెల నరేశ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కాటూరు రోడ్డులో నగర పంచాయతీ మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. శ్రీను, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.





తాడిగడపలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. బాపులపాడులో ఎమ్మెల్యే యార్లగడ్డ

అర్హులందరికి సంక్షేమ ఫలాలు..

కంకిపాడు : అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాలని తెన్నేరు డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ (డీసీ) యార్లగడ్డ రాజా అన్నారు. మండలంలోని తెన్నేరులో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, టీడీపీ మండల అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, ఏఎంసీ డైరెక్టర్ దండమూడి లక్ష్మి, ఉద్దండి కుటుంబరావు, కలపాల రాజశేఖర్, నిమ్మగడ్డ నాగేశ్వరరావు, యలమంద, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రొద్దుటూరులో నిర్వహించిన సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పామర్తి పావనమూర్తి, గ్రామ పార్టీ అధ్యక్షులు ఈడా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలందరికి ఇళ్ల స్థలాలు

హనుమాన్‌జంక్షన్ : ఇళ్లులేని పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం బాపులపాడులోని హనుమాన్ నగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా సొంతిళ్లు లేక ఇబ్బంది పడుతున్నామని గ్రామ సచివాలయంలో దరఖాస్తులు తీసుకోవడం లేదని పలువురు పేదలు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన స్పందించి ఆన్‌లైన్ దరఖాస్తులు తీసుకునే వీలు లేనపుడు ఆఫ్‌లైన్‌లో ఇళ్ల స్థలాల దరఖాస్తులు స్వీకరించాలని డీటీ విమలను ఆదేశించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరావు, ఆట్లూరి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సుపరిపాలనతోనే సంక్షేమాభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : అన్ని వర్గాలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందిస్తూ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేలా అభివృద్ధి చేయడం సుపరిపాలనతోనే సాధ్యమని టీడీపీ అధ్యక్షుడు కొల్లూరు చంద్రకాంత్ తెలిపారు. రేమల్లెలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకుడు కలపాల రాధాకృష్ణమూర్తితో కలిసి పాల్గొన్నారు. ఆయన వెంట కార్యదర్శి ఈడే నారాయణ, వడ్లమూడి కృష్ణయ్య, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.





గన్నవరం, ఉయ్యూరులో ఉద్యోగుల నిరసన

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ అసిస్టెంట్ కార్యదర్శి ఎన్.మోహనరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్క్యులర్ నెంబర్ 01/2019 యథావిధిగా అమలు జరిగేలా స్పష్టమైన ఆదేశాలు వెంటనే ఇవ్వాలన్నారు. డిపో అధ్యక్షులు బి.సంజీవరావు, కార్యదర్శి టీవీకే రఆవు, ఉపాధ్యక్షులు టి.పద్మనాభులు కోశాధికారి యూవి రావు, నానిబాబు, కేఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిస్ యూనియన్ ఉయ్యూరు డిపో ఉద్యోగులు శుక్రవారం డిపో గ్యారేజి గేటు ఎదుట ధర్నా చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి వైవీ రావు మా ట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేర డిపో గ్యారేజి గేటు ఎదుట ధర్నా చేసి నిరసన ద్వారా యాజమాన్యానికి తెలియపరిచామన్నారు. కోశాధికారి కేవీ రావు, డిపో అధ్యక్ష కార్యదర్శులు టీవీఎస్ నారాయణ, రవికుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాం: టీడీపీ

కంకిపాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తామని టీడీపీ కంకిపాడు మండల ప్రధాన కార్యదర్శి పామర్తి పావనమూర్తి అన్నారు. తనకు మండల ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈడా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల విధానాలతో కార్మిక వర్గానికి అన్యాయం



గన్నవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల అసంఘటిత రంగంలోని కార్మిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని, రక్షణ లేకుండా పోతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మండల స్థాయి కార్మిక సంఘాల విస్తృత సమావేశం జరిగింది. సమావేశానికి మండల అధ్యక్షులు బెజవాడ తాతబ్బాయి అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు వై.నరసింహారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో అంగన్వాడీలకు ముఠా వర్కర్లకు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. అనంతరం కన్వీనింగ్ కమిటీ కార్యదర్శిగా తాతబ్బాయిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు సమ్మక్క, మరియదాసు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల సమస్యలు పరిష్కరించాలి

ఆర్డీవోకు రైతు సంఘాల నేతల వినతి



ఉంగుటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఎలుకపాడులో సుమారు నాలుగు దశాబ్దాల క్రితం భూమిలేని పేదలకు ప్రభుత్వం పంచి ఇచ్చిన అసైన్డ్ సాగుభూమి ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని బాధితులతో కలిసి సీపీఎం నాయకులు ఆర్డీవో (గుడివాడ)జి.బాలసుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. బుడమేరు ఆధునీకరణలో భూములు కోల్పోయి నష్టపరిహారం అందని రైతుల వివరాల పరిశీలనకు శుక్రవారం ఎలుకపాడు గ్రామానికి విచ్చేసిన ఆర్డీవోను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి, మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు కలిసి అసైన్డ్‌భూమి సమస్యలను వివరించారు.

● బుడమేరు ఆధునీకరణలో భూములు కోల్పోయి ఇప్పటివరకు నష్టపరిహారం అందని రైతులతో బుధ, గురువారాల్లో విస్తృ త సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించి, సత్వరమే నివేదికలను పంపాలని ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ జె. విమలకుమారి, ఆర్ఐ బి.సూర్యకాంతి, ఏవో గద్దె రమేష్, డ్రెయినేజీ డీఈఈ నాగేంద్రకుమార్, ఏఈఈ ఉదయ్‌కిరణ్ జ్యోతి పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రులు

గన్నవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రులు శుక్రవారం ఘనంగా ముగిసాయి. శ్రీలలిత సహస్రనామ పారాయణం, వారాహి అష్టోత్తరం జరిపారు. లక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించి పూజలు చేశారు.

శాకంబరీగా..



యాకమూరులోని బోలెం అంకమ్మతల్లి శాకంబరీ దేవిగా శుక్రవారం దర్శనమిచ్చారు

అన్నదాత సుఖీభవకు అర్జీలు ఇవ్వొచ్చు

ఉయ్యూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించని రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులకు అర్జీ ఇవ్వవచ్చని ఉయ్యూరు మండల వ్యవసాయ అధికారి బి. నిస్సీగ్రేస్ తెలిపారు. అన్నదాత సుఖీభవకు అర్హత లేదని తేలిన వారు రైతు సేవా కేంద్రంలో అర్జీ ఇస్తే పోర్టల్‌లో నమోదు చేస్తారని, ఈ పథకానికి సంబంధించి అర్హుల ఎంపిక పూర్తి కాగా వారి వివరాలు పోర్టల్‌లో ఉన్నాయని వివరించారు. రైతులు ఆధార్ నంబరు నమోదు చేసి అర్హుల జాబితాలో ఉన్నామో లేదో తెలుసుకోవచ్చని అనర్హులని తేలితే 155251 నంబరుకు ఫోన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

ఘనంగా వంగవీటి , అల్లూరి జయంతి

పెనమలూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో, తాడిగడప మునిసిపాలిటీలో వంగవీటి రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. యనమలకుదురు చిన్న వంతెన వద్ద రంగా అభిమానులు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రంగా తనయుడు రాధాబాబు, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్‌లు ఆవిష్కరించారు. తాడిగడప కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **ఉయ్యూరు :** విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని శివాలయం మాజీ చైర్మన్ చిందా వీర వెంకట కుటుంబరాజు, సీపీఎం నాయకుడు శివనాగేంద్రం పిలుపు నిచ్చారు. అల్లూరి సీతారామరాజు జయంతిని క్షత్రియ సంక్షేమ సంఘం, కుటుంబరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ● రంగా జయంతి కాటూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో రంగా విగ్రహానికి జనసేన యువనేత ఇందిరాసి పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. **ప్రసాదంపాడు :** రామవరప్పాడు టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో రంగా జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. **విజయవాడ రూరల్ :** నున్నలో పార్టీలకు అతీతంగా దివంగత నేత రంగా జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హైస్కూల్ సమీపంలోని రంగా విగ్రహం సెంటర్‌లో జరిగిన కార్యక్రమం లో టీడీపీ, జనసేన, వైసీపీ నేతలు రంగా విగ్రహం వద్ద నివాళులర్పించారు. ● అంబాపురంలో రంగా జయంతి ఘనంగా జరిగింది. కాపు సేవాసంఘం నేత వంగవీటి నరేంద్ర, అంబాపురం వైసీపీ అధ్యక్షుడు నల్లమోతు చంద్రశేఖర్‌లు రంగా చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **కానూరు :** కానూరులోని అశోక్ జిమ్ ఆధ్వర్యంలో విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా జరిగింది. యువజన సర్వీసుల శాఖాధికారి రఘురామ్, అశోక్ జిమ్ నిర్వాహకుడు తాళ్లూరి అశోక్, విద్యుత్ శాఖ అధికారి కిరణ్, పి. నాగేశ్వర రావు తదితరులు పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ● కానూరులో రంగా జయంతి శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని రంగా విగ్రహానికి ఆయన అభిమానులు పూలమాలలువేసి నివాళులర్పించారు. **హనుమాన్‌జంక్షన్ :** అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం నేటికి స్ఫూర్తిదాయకమని మానవత స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. అల్లూరి జయంతి సందర్భంగా స్థానిక ఏలూరు రోడ్డు లోని మానవత కార్యాలయంలో వేడుకను నిర్వహించారు. **హనుమాన్ జంక్షన్‌రూరల్ :** వంగవీటి రంగా ఆశయసాధనకు కలిసి కట్టుగా కృషి చేయాలని గరికపాటి శివశంకర్,వడ్డి అశోక్ వేర్వేరు కార్యక్రమాల్లో పిలుపు నిచ్చారు. కొత్తపల్లి, కోడూరుపాడు, కానుమోలు, దంటగుంట్ల తదితర గ్రామాల్లో శుక్రవారం వంగవీటి రంగా జయంతి నిర్వహించారు.





యనమలకుదురులో రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వంగవీటి రాధా, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్.. రామవరప్పాడులో..



ఉయ్యూరులో అల్లూరి జయంతి

స్వామి వారికి పట్టువస్త్రాలు అందజేత

హనుమాన్‌జంక్షన్ : శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం దేవతామూర్తులకు ఆలయ ట్రస్టీ కాకాని బాబు, అరుణ దంపతులు పట్టువస్త్రాలు అందజేశారు. ఆదివారం తొలిఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



హనుమాన్‌పురంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ, బంటుమిల్లిలో పెడన ఎమ్మెల్యే కాగిత

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం

● ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్

మచిలీపట్నం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదికాలం పూర్తిచేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలిఅడుగు శుక్రవారం జిల్లావ్యాప్తంగా జరిగింది. ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలు చెప్పిన సమస్యలను సావధానంగా విని, ప్రాధాన్యతా క్రమంలో పనులు చేస్తామని హామీ ఇచ్చారు. గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు పంచాయతీ హనుమాన్‌పురంలో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను చేరువ చేస్తామని హామీ ఇచ్చారు. పెడన నియోజకవర్గంలోని బంటుమిల్లిలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పర్యటించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రెయిన్‌లు సక్రమంగా లేవని, పింఛన్లు, ఇళ్లస్థలాలివ్వాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గుడివాడ పట్టణంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేశామని చెప్పారు. 33,34,35 వార్డుల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఇంటింటికీ తిరిగారు. పామర్రులోని 13వ వార్డు తోట ప్రాంతంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పర్యటించారు. తమ ప్రాంతంలో డ్రెయిన్ల సమస్య తీవ్రంగా ఉందని, పరిష్కరించాలని ఎమ్మెల్యేను ప్రజలు కోరారు.



పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఇమ్రాన్

నిధుల గోల్‌మాల్‌పై ఎంపీడీవో విచారణ

గుడ్లవల్లేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'గ్రామ పంచాయతీలో నిధులు గోల్‌మాల్' శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎండీ ఇమ్రాన్ వెంటనే స్పందించారు. గురువారం ఆయన గ్రామ పంచాయతీకి వెళ్లి రికార్డులను పరిశీలించారు. నాలుగేళ్లుగా పంచాయతీ ఖాతాల ఎక్స్‌పెండిచర్‌లో స్పష్టత లేకపోవడం, పలు పనుల రికార్డులు లేకపోవడం, పంచాయతీ నిధుల వినియోగంలో అక్రమాలున్నట్టు వచ్చిన కథనంలో ప్రస్తావించిన అంశాలపై స్పష్టమైన రికార్డులతో కూడిన వివరణ రెండు రోజుల్లో ఇవ్వాలని ఆదేశిస్తూ పంచాయతీ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావుకు పూర్తి అదనపు బాధ్యతలతో కూడిన నోటీసుజారీ చేశారు.

పెంపుడు జంతువులతో జాగ్రత్త..!

రేబిస్ నివారణకు వ్యాక్సినేషనే మార్గం.. రేపు జూనోసిస్ డే



కృష్ణలంక, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కలు చూడటానికి ఎంతందంగా ఉన్నా, జాగ్రత్తలు తీసుకోకపోతే కుక్కలకూ, వాటిని సాకే వారికీ ప్రమాదమే. ఇప్పుడు చాలా ఇళ్లలో కుక్కపిల్లలు తిరగడం ఫ్యాషన్‌గా మారింది. కొందరికి వీటిని సాకడం జీవితంలో ఒక భాగమైంది. ప్రేమ, విశ్వాసం చూపడంలో కుక్కలకు సాటిలేదు. అయితే, వాటిపట్ల పరిశుభ్రత, సంరక్షణ విషయాల్లో అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాన్ని కొనితెచ్చినట్లే. 'జూనోసిస్ డే' లక్ష్యం జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధుల గురించి అవగాహన కల్పించి, వాటిని అరికట్టడం. రేబిస్ వ్యాధికి మందులు లేని సమయంలో శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ 'యాంటీ రేబిస్' వ్యాక్సిన్‌ను కనుగొని మహోపకారం చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది జూలై 6న 'జూనోసిస్ డే' జరుపుకుంటున్నాం.

జంతువుల నుంచి సోకే వ్యాధులివే..


జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధుల్లో రేబిస్, బ్రూసెల్లోసిస్, ఆంథ్రాక్స్ క్షయ, లెప్టోస్పైరోసిస్, మెదడు వాపు, తామర మొదలైనవి. వీటిలో రేబిస్ అత్యంత ప్రమాదకరం. నివారణ తప్ప చికిత్స లేదు. పిచ్చికుక్కల నుంచి వ్యాపిస్తుంది. ఈ వైరస్ కుక్క ఉమ్మిలో ఉండి, కాటు ద్వారా శరీరంలోకి చేరి వ్యాధిని కలిగిస్తుంది. పుండుపై కుక్క చొంగినా వ్యాధి వచ్చే అవకాశం ఉంది. నెలల్లోనే లక్షణాలు బయటపడతాయి. దీన్ని హైడ్రోఫోబియా అంటారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తి గుటకలు వేయలేక, నీళ్లు తాగేటప్పుడు బాధపడతాడు. కుక్క కరిచిన వెంటనే పుండును సబ్బునీళ్లతో కడిగి, డాక్టరును సంప్రదించి టీకాలు వేయించుకోవాలి. మెదడు వాపు జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వైరస్ వల్ల వస్తుంది. ఈ వైరస్ దోమల ద్వారా పందుల నుంచి మనుషులకు వ్యాపిస్తుంది. మురుగునీరు నిల్వ లేకుండా చేయడం, పందుల పెంపకాన్ని దూరంగా చేపట్టడంతో నివారించవచ్చు. ఆంథ్రాక్స్ బేసిల్లస్ ఆంథ్రసిస్ బాక్టీరియా వల్ల వస్తుంది. వ్యాధిగ్రస్త జంతువుల మాంసం తినడం, గొర్రెల ఉన్ని ద్వారా వ్యాధి సోకుతుంది. వ్యాధిగ్రస్త మాంసం తినకుండా ఉంటే నివారించవచ్చు. బ్రూసెల్లోసిస్ బ్రూసెల్లా బాక్టీరియా వల్ల వస్తుంది. గర్భస్రావ పిండాన్ని జాగ్రత్తలు లేకుండా తీసివేయడం, పశువులతో సన్నిహితంగా ఉండటం, వ్యాధిగ్రస్త పశువుల పచ్చిపాలు తాగడం ద్వారా సోకుతుంది. పశువులకు దూరంగా ఉండటం, పాలను కాచి తాగడం ద్వారా నివారించవచ్చు. క్షయ మైకోబాక్టీరియం బాక్టీరియా వల్ల వస్తుంది. వ్యాధిగ్రస్త పశువుల మల, మూత్రం, ఉమ్మితో కలుషితమైన ఆహారం, పాలు తీసుకోవడం ద్వారా సోకుతుంది. వ్యాధిగ్రస్త పశువులను వేరుచేయడం ద్వారా నివారించవచ్చు. లెప్టోస్పైరోసిస్ లెప్టోస్పైరా బాక్టీరియా వల్ల, కుక్కల మూత్రం ద్వారా కలుషితమైన నీరు తాగడం వల్ల వస్తుంది. పెంపుడు కుక్కలకు టీకాలు వేయడం ద్వారా నివారించవచ్చు.

జాగ్రత్తలు పాటించండి

● డాక్టర్ కామని శ్రీనివాసరావు



పెంపుడు కుక్కల యజమానులు పాటించాల్సిన జాగ్రత్తలను పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు వివరించారు. కుక్కలుండే ప్రదేశాన్ని క్రిమిసంహారక ద్రావణంతో శుభ్రపరచాలన్నారు. మాంసం, చేపలు ఉడకబెట్టి వాడాలని, కుక్కలను తాకిన తర్వాత చేతులు క్రిమిసంహారక ద్రావణంతో కడగాలన్నారు. వ్యాధిగ్రస్థ కుక్కలను ఆరోగ్యవంతమైన కుక్కలకు, పిల్లలకు దూరంగా ఉంచాలలన్నారు. వ్యాధుల నివారణకు రెగ్యులర్ టీకాలు వేయించాలని, నట్టల నివారణ మందు క్రమం తప్పకుండా వేయించాలని తెలిపారు. జూనోసిస్ డే సందర్భంగా జూలై 6న అన్ని ప్రభుత్వ పశువుల ఆస్పత్రుల్లో కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాక్సిన్‌లు వేస్తారని డాక్టర్ కామని శ్రీనివాసరావు తెలిపారు. పశుపోషకులు, పెంపుడు కుక్కల యజమానులకు వ్యాధులపై అవగాహన శిబిరం ద్వారా చైతన్యం కల్పిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఐదేళ్ల ఉద్యమం ఫలిస్తుందా?

● 11న జరిగే ఎంఎంసీ సమావేశం అజెండాలో పట్టాభి భవన నిర్మాణం

మచిలీపట్నం టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి ఈనెల 11న నిర్వహించనున్న మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో అజెండాలో 5వ అంశంగా ప్రవేశపెట్టి మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ కార్పొరేటర్లు, అధికారులు, సభ్యులకు పంపారు. బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి అభ్యర్థన మేరకు అప్పటి సీఎం జగన్ ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజుపట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి శిడింబి అగ్రహారంలో రెండెకరాల భూమిని కేటాయించేందుకు అంగీకరించారు. యూనియన్ బ్యాంకు భూమిని కేటాయిస్తే రూ.40కోట్లతో భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు ప్రాథమికంగా నగర పాలక సంస్థ ఎన్‌వోసీ ఇవ్వాలని యూనియన్ బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. దీంతో అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న కొల్లు రవీంద్ర, 45వ డివిజన్ టీడీపీ నేత పీవీ పణికుమార్ ఉద్యమం ప్రారంభించారు. అనంతరం అన్ని రాజకీయ పార్టీలతో ఒక కమిటీ వేసి ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లారు. న్యాయవాది సోడిశెట్టి బాలాజీ అధ్యక్షతన న్యాయవాదులు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలున్నారు. దీనిపై పీవీ పణికుమార్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఎన్‌వోసీ ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు అమలు చేయాలని కలెక్టర్‌కు, ఎంపీ బాలశౌరికి వినతిపత్రాలు సమర్పించారు. ఎట్టకేలకు అమలు చేయక తప్పలేదు. ఈనెల 11న నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టే ఎన్‌వోసీ అంశంపై పాలకవర్గం ఏం నిర్ణయం తీసుకుంటుందోనని పట్టాభి అభిమానులు ఆతృతతో ఉన్నారు. కౌన్సిల్‌లో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన నాలి శారదతోపాటు టీడీపీ ఐదుగురు, జనసేన సభ్యులు ఒకరు మాత్రమే ఉన్నారు. వైసీపీ సభ్యులు 43 మంది ఉండటంతో ఎన్‌వోసీ ఇస్తారా లేదా అని చర్చనీయాంశంగా మారింది.

ఆర్టీసీ కండక్టర్‌పై దాడి.. నిందితులకు జైలుశిక్ష

తోట్లవల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కండక్టర్‌పై దాడి చేసిన ఇద్దరు నిందితులకు ఏడాది జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం కోర్టు తీర్పిచ్చిందని సీఐ వై చిట్టిబాబు, ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు. 2020 ఫిబ్రవరి 28న అవనిగడ్డ నుంచి విజయవాడ వెళుతున్న కరకట్ట ఎక్స్‌ప్రెస్ బస్సులో శ్రీకాకుళం వద్ద జటావత్ ప్రదీప్ విజయవాడ వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. టికెట్ విష యంలో కండక్టర్ రాజనాల సుధీర్ గొడవపడ్డాడు. ఈ విషయాన్ని ప్రదీప్ తన తండ్రి వీరభద్రరావుకు ఫోన్‌లో చెప్పటంతో ఆయన బస్సుని వెంబడించి తోట్లవల్లూరు వద్ద ఆపి కండక్టర్ సుధీర్‌పై చేయి చేసుకున్నాడు. కండక్టర్ సుధీర్ ఫిర్యాదు మేరకు జటావత్ ప్రదీప్, వీరభద్రరావుపై నాటి ఎస్సై చిట్టిబాబు కేసు నమోదు చేశారు. చార్జిషీట్ కోర్టుకు సమర్పించగా ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ టీ మాధవీలత పాల్గొని వాదనలు వినిపించారని సీఐ, ఎస్సై తెలిపారు.

అల్లూరి, పింగళి దేశభక్తి స్ఫూర్తిదాయకం



అల్లూరి, పింగళి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

మచిలీపట్నం టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తిప్రదాత అల్లూరి సీతారామరాజు, జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య దేశభక్తి అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ డీకే బాలా జీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి, జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో వారి చిత్రపటాలకు శుక్రవారం కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, గిరిజన సంక్షేమశాఖాధికారి ముదిగొండ ఫణిధూర్జటి, ఏవో రాధిక, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవిల పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహనీయుల త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. చిలకలపూడి పోలీసు స్టేషన్ పక్కనున్న పింగళి వెంకయ్య విగ్రహానికి జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎస్పీ సీహెచ్ రాజా, ఆర్‌పేట సీఐ ఏసుబాబు, ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు చిలకలపూడి, మచిలీపట్నం ఎస్సైలు పాల్గొన్నారు. వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య విగ్రహానికి మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వెలుగు ఫౌండేషన్ అధ్యక్షుడు కే బాబు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు, స్టార్ విద్యా సంస్థల అధినేత పీ శ్రీరాం, ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, రేపల్లె వసంతరావు మాట్లాడారు. అలాగే డీసీఎంఎస్ చైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ పినిశెట్టి నాగఛాయాదేవి, పినిశెట్టి వేణు, గడ్డం రాజు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకువెళ్లాలి

నిరాశ చెందకుండా ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని విజయాలు సాధించాలని కొవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలతో కలెక్టర్ బాలాజీ అన్నారు. శుక్రవారం సమావేశపు హాలులో ముఖాముఖి మాట్లాడారు. పిల్లల బాగోగుల వివరాలు, వారి సంరక్షకుల వివరాలు తెలుసుకున్నారు. బాగా చదువుతున్నారా అని ప్రశ్నించారు. జీవితంలో ఏదో ఒక రంగాన్ని ఎంచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఐసీడీఎస్ పీడీ రాణి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, సచివాలయాల సమన్వయ అధికారి రవికాంత్, ఐసీడీఎస్ డీసీడీవో రవిబాబు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్



పల్లెటూరి సరదాలు

మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోసెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

కొండాలమ్మకు ఆషాఢ సారె

గుడ్లవల్లేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మ వారికి పద్మాలపాలెం గ్రామస్థులు ఆషాఢమాసం సందర్భంగా ఆషాఢ సారెను , పట్టు వస్త్రాలను శుక్రవారం సమర్పించారు. గ్రామానికి చెందిన మహిళలు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఆలయానికి పసుపు, కుంకమ, పండ్లు, పూలు, స్వీట్‌లతో ఆలయానికి చేరుకొని పూజాదికార్యక్రమాలు నిర్వ హించించారు. అనంతరం సారెను అమ్మవారికి సమర్పించారు. కాగా ఆది వారం 6వతేదీన కొండాలమ్మ అమ్మవారు శాఖాంబరిగా భక్తులకు దర్శనమి వ్వనున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.



అమ్మవారికి ఆషాఢం సారెను తెచ్చిన పద్మాలపాలెం గ్రామస్థులు

అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అభివృద్ధే లక్ష్యంగా ఇంటింటికీ రెట్టింపు సంక్షేమ పథకాలను అమలేస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం పట్టణం లోని 33,34,35 వార్డుల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్య క్రమంలో భాగంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ఐఎంఏ గుడివాడ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాంబాబు, ప్రసాద్, జగన్మోహనరావు పాల్గొన్నారు.

పామర్రు : కూటమి ప్రభుత్వం సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అహర్నిశలు శ్రమిస్తూ అభివృద్ధి దిశగా నడిపిస్తుందని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని పామర్రులోని 13వార్డులో కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. దీనిలో భాగంగా ఆ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలేస్తూ,



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి, యలవర్తి, తదితరులు



ఇంటింటికీ కరపత్రాలతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

అన్న క్యాంటీన్లు, దీపం పథకం ప్రారంభించామని వివరించారు. కూటమి నేతలు తాడిశెట్టి మధు, పరస సుబ్రమణ్యం, అల్లంశెట్టి సురేష్, వీరంకి వెంకటేశ్వరరావు, దాసరి కొండ, మోహనరావు, అనితరెడ్డి , సాయి, ఎమ్మార్పీఎస్ నేతలు కాటూరి శ్రీనివాసరావు, రమేష్, తెలుగు యువత నాయకులు సందీప్ , రామాంజనేయులు పాల్గొన్నారు.

పెదపారుపూడి : కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా మండలంలోని గురువిందగుంట, మహేశ్వరపురం, దూళ్లవానిగూడెంలలో సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ ప్రతీ ఒక్కరి సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు టీడీపీ మండల శాఖ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు వెచ్చించి ఆయా గ్రామాల్లో సిమెంట్ రోడ్లను నిర్మించామన్నారు. ఈ రోడ్లను నేటి బాలలే రేపటి పౌరులని భావించి చిన్నారులైన పెదపూడి జాహ్నవ్, పెదపూడి దుహశ్రీ తదితర చిన్నారులతో ఎమ్మెల్యే దగ్గర ఉండి రోడ్లను ప్రారంభింపచేశారని చలసాని తెలిపారు. టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ నాయకుడు కిషోర్, బీజేపీ జిల్లా స్థాయి నాయకుడు దొండపాటి శివాజీ, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షులు పోలిశెట్టి నాగ సురేష్, సాగునీటి సంఘం అధ్యక్షులు కాగిత లక్ష్మీనారాయణ, వీరంకి శ్రీనివాసరావు, గోగం రామారావు, కొమరవల్లి రాజారావు, పెదపూడి బాబురావు పాల్గొన్నారు.



వర్మీకంపోస్టును పరిశీలిస్తున్న సంపత్‌కుమారి

చెత్త సంపద కేంద్రం పరిశీలన

గుడ్లవల్లేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిల్వఉండే చెత్తను సద్వినియోగం చేసుకొనేందుకు ప్రభుత్వం గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను ఏర్పాటు చేసిందని గుడివాడ డివిజినల్ పంచాయతీ అధికారిని జి.సంపత్‌కుమారి అన్నారు. శుక్రవారం గ్రామంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. డోకిపర్రులో గుడ్‌మార్నింగ్ శానిటేషన్ కార్యక్రమంలో ఆమెమాట్లాడుతూ ప్రజలకు పొడిచెత్త, తడిచెత్త వేర్వేరుగా ఎలా గ్రీన్ అంబాసిడర్లు వచ్చినపుడు ఇవ్వాలి అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి నరసింహారావు సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఎమ్మెల్యే నివాళి

గుడివాడ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరురోడ్డులోని గాంధీ బొమ్మసెంటర్‌లో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్ ఆధ్వర్యంలో రోశయ్య 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత రోశయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే వెనిగండ్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



భువనేశ్వరిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కూచిపూడి, జూలై 4(ఆంధ్రజ్యోతి): కూచిపూడి సిద్ధేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ హైస్కూలు నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులకు శుక్రవారం సాయంత్రం పాఠశాల ఆవరణలో సన్మానం చేశారు. అలాగే వివిధ పాఠశాలల నుంచి బదిలీపై విచ్చేసిన ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతూ అభినందన కార్యక్రమం నిర్వహించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులైన ఎస్.శ్రీనివాస్, నెహ్రూ, ఏ.సురేష్, డి.లక్ష్మీ కుమారి, ఏ.పద్మ, డి.సుందరమ్మల విద్యా సేవలను కొనియాడుతూ సత్కరించారు. అలాగే శ్రీకాకుళం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి బదిలీపై విచ్చేసిన హెచ్ఎం భువనేశ్వరిని శాలువాతో పూలదండలతో సత్కరించారు. పాఠశాలకు బదిలీపై విచ్చేసిన ఉపాధ్యాయులైన ఎస్.రామకృష్ణ, డి.శేషగిరి, ఎల్.శ్రీనివాసరావు, కె.నిర్మల, కె.వసుంధర, కె.శ్రీనివాసరావును అభినందించి పాఠశాల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

మొవ్వలో జాతీయ లోక్ అదాలత్ నేడు

కూచిపూడి : రాజీ మార్గమే ధ్యేయంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మొవ్వ న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి స్వర్ణలత వోల్గా మార్క్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయ స్థాన పరిధిలోని కూచిపూడి (మొవ్వ), ఘంటసాల, చల్లపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని రకాల సివిల్ , క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు తమ న్యాయవాదులను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడలో..

గుడివాడ, జూలై 4(ఆంధ్రజ్యోతి) : పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటూ అనేక సమస్యలపై పోరాడిన ధీశాలి వంగవీటి మోహనరంగా అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రంగా 78వ జయంతిని పురస్కరించుకుని టీడీపీ, జనసేనల ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బేతవోలు సెంటర్‌లోని రంగా విగ్రహానికి ఎమ్మెల్యే వెనిగండ్ల, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీచైర్మన్ శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్థానిక ఆంజనేయపేటలోని జనసేన కార్యాలయంలో జనసేన నేత సందు పవన్ ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేర్ని జగన్, గంగాధర్, సయ్యద్ నజీర్, సుభాషిణి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

స్థానిక ఏజీకే సెంటర్‌లో గుడివాడ కాపు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పి.రామకృష్ణ ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పామర్రు : సమాజంలో కుల,మతాలకు అతీతంగా పేద బడుగు వర్గాల ప్రజలకు సేవలందించిన మహనీయుడు దివంగత శాసనసభ్యుడు వంగవీటి మోహన రంగానేనని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక తోట రామాలయం సెంటర్‌లో రాధారంగా మిత్రమండలి ఆధ్వర్యంలో శుక్రవారం రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రంగా జన్మదిన వేడుకల కేక్ కట్‌చేసి అందరికీ స్వీట్లు, కేక్‌లు పంచిపెట్టారు. ఉండ్రపూడి, పోలవరం, పెదామద్దాలి తదితర గ్రామాల్లో గల రంగా విగ్రహాలకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, మధు, ఎంపీటీసీ సభ్యుడు కూనపరెడ్డి సుబ్బారావులు పూలమాలలేసి నివాళులర్పించారు. రాధా-రంగా మిత్రమండలి అధ్యక్షుడు సాంబశివరావు, సురేష్, మధు, శోభనబాబు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : వంగవీటి మోహనరంగా 78వ జయంతి వేడుకలను కూరాడ, పెసరమిల్లి, విన్నకోట, వడ్లమన్నాడు, కౌతవరం, గుడ్లవల్లేరు గ్రామాల్లో రంగా విగ్రహాలకు ఆయా గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురళి, రాంబాబు, రమేష్, వెంకటేష్, పాల్గొన్నారు.



పామర్రులో..

తెల్లదొరలను ఎదిరించిన ధీరుడు అల్లూరి

గుడివాడ, జూలై 4(ఆంధ్రజ్యోతి) : తెల్లదొరల నుంచి భారతీయుల విముక్తి కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని గుడివాడ క్షత్రియ సేవా సమితి గౌరవాధ్యక్షుడు గాదిరాజు జగ్గరాజు, అధ్యక్షుడు కోసూరి రవిరాజులు పేర్కొన్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా గుడివాడ క్షత్రియ సేవా సమితి, స్మారక కమిటీల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు బిర్యానీ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు స్మారక కమిటీ అధ్యక్షుడు సాగిరాజు ఉదయభాస్కరరాజు, కార్యదర్శి శ్రీనివాసరాజు, పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈశ్వర వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

కూచిపూడి : కోసూరు క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాగేశ్వరరాజు, నాగరాజు, వెంకటేశ్వరరాజు, అబ్దుల్ సలాం పాల్గొన్నారు. మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి చిత్ర పటానికి తహసీల్దార్ కె.మస్తాన్, ఆర్ఐ విజయ దుర్గా పాల్గొని నివాళులర్పించారు.

గుడివాడ రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్ సిబ్బంది అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పమిడిముక్కల : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి డీవైఈవో పద్మరాణి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్రం కోసం సీతారామరాజు చేసిన పోరాటాలు, మన్యం ప్రజలను చైతన్యపరచడాన్ని గుర్తుచేశారు. ఎంపీడీవో సీతా రామరాజు, గోలిరామకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనం

తోట్లవల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సన్నబియ్యంతో భోజనం పాఠశాలల విద్యార్థుల్లో పెనుమార్పు తీసుకు వచ్చింది. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలల్లో మిడ్డేమీల్స్‌కి ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తుండటంతో విద్యార్థుల్లో పరివర్తన కనిపించింది. గతంలో 40 శాతం మందే మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థులు ఇపుడు వంద శాతానికి చేరటం ఈ మార్పుని సూచిస్తోంది. తోటవల్లూరు జడ్పీ హైస్కూల్లో శుక్రవారం మధ్యాహ్న భోజనం కోసం విద్యార్థులు క్రమశిక్షణగా క్యూ లైన్‌లో నిలబడి అందరి దృష్టిని ఆకర్షించారు. ఒక్కరూ ఇంటి నుంచి లంచ్ బాక్స్ తేలేదని హెచ్ఎం ఫణి రాజమోహన్ తెలిపారు. గతంలో చాలామంది విద్యార్థులు ఇంటి నుంచి లంచ్ బాక్స్ తెచ్చుకుని హైస్కూల్లో భోంచేసేవారు. విద్యార్థులందరు ప్లేట్లు చేతపట్టి క్యూ లైన్‌లో నిలబడిన తీరు పోలింగ్ రోజున ఓటర్లు క్యూ లైన్‌ను గుర్తుకు తీసుకువచ్చింది. ఎంఈఓ-2 సురేష్, హెచ్ఎం ఫణి రాజమోహన్ మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ సభ్యులు

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

● కె.బాలాజీ

గుడివాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగులకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని, పీఆర్‌సీ, డీఏ బకాయిలను చెల్లించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.బాలాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు ఎం.వి రమణ, కె.ఎస్.రావుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ పాత పద్ధతుల్లో రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్యసౌకర్యాలను అందించాలన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, నూతన బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ , డీఏ బకాయిలను చెల్లించాలని తదితర డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. సీసీఎస్ డెలిగేట్ సుబ్రహ్మణ్యం, రీజనల్ నాయకులు కె.వాణి, పి.కొండలరావు, సాయికుమార్, అజీజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడ, జూలై 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అందించే కుక్కలకు రాబిస్ వ్యాధి నిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో రాబిస్ వ్యాధి నిరోధక టీకాల ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జూలై 6వతేదీన ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగాబహుళార్థ పశువైద్యశాలలోకుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాధి నిరోధక టీకాల వేస్తారని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.చిన్న నరసింహులు తెలిపారు.



అధికారులకు నష్టాన్ని వివరిస్తున్న వినియోగదారులు

నష్ట పరిహారం ఇవ్వాలని వినతి

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో విద్యుత్ హైఓల్టేజ్ వచ్చి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాలు కాలిపోయిన విషమం విదితమే. దాదాపు 20కి పైగా కుటుంబాలలో ఈ విధమైన నష్టం వాటిల్లిందని ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోవడం పట్ల విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఆవేదనచెందుతూ శుక్రవారం కౌతవరం సబ్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఇక్కడి ఏఈ ఇన్‌చార్జ్ కావడంతో సబ్‌స్టేషన్‌లో లేకపోవడంతో సబ్‌ఇంజనీర్‌కు తమ పరిస్థితిని వివరించారు. లక్షలాదిరూపాయిలు నష్టం వాటిల్లిందని తమకు జరిగిన నష్టాన్ని ఎవరు బాధ్యతవహిస్తారని సిబ్బందిని వినియోగదారులు నిలదీశారు. ఏఈతో ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యను వివరించారు. కార్యక్రమంలో వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, సంతూర్ కృష్ణ, మూల్పూరి సుధాకర్, అడుసుమిల్లి వీరబద్రరావు, సజ్జా రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యవర్గం ఏకగ్రీవం

గుడివాడ : సీపీఐ గుడివాడ నియోజకవర్గ కార్యదర్శిగా గూడపాటి ప్రకాష్‌బాబు, సహాయ కార్యదర్శిగా చింతలూరి సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా వెంకటనరసింహరావు, గుజ్జర్లమూడి శేషుబాబు, ఎం.డి సాదిక్, డి.రామకృష్ణ, వి.నాగరాజులు ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

● ఎస్సై శ్రీనివాస్

నందివాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందల కొద్ది లారీలు రాకపోకలు ప్రమాదాలకు గురవుతున్న సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు నందివాడ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధర్‌రావు, గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. జనార్ధనపురం శివారు గుడివాడ నుంచి హనుమాన్ జంక్షన్ వెళ్లే రోడ్డుపై శుక్రవారం రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు రేడియం స్టిక్కర్లతో డ్రమ్ములను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించామన్నారు. జనార్ధనపురం టెలిఫోన్ నగర్ వద్ద ఆరు రేడియం స్టిక్కర్లతో డ్రమ్ములను ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదాలు జరుగకుండా వేగం కన్నా ప్రాణం మిన్న అని రోడ్డు ప్రమాదం జరిగితే ప్రమాదం ఒక్కడికే కాదని కుటుంబం మొత్తానికి ప్రమాదం అన్న సంగతి ప్రతీ వాహనదారుడు గుర్తించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.



టెలిఫోన్ నగర్ వద్ద రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసిన ఎస్సై శ్రీనివాస్

గ్రామాల అభివృద్ధే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

తోట్లవల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను ప్రగతి పథంలో నడిపించటమే తన కర్తవ్యమని, ఇందులో ఎక్కడైనా తప్పులు జరిగితే నిర్మోహమాటంగా ప్రజలు తన దృష్టికి తేస్తే సరిదిద్దుకుని ముందుకు సాగుతానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. దేవరపల్లిలో శుక్రవారం రాత్రి ప్రగతి పథంలో పామర్రు కార్యక్రమంలో భాగంగా పాత గ్రామ పంచాయతీ కార్యాలయం సెంటర్లో ప్రజావేదిక నిర్వహించారు. రైతులకు వర్షాకాలంలో పంటల నష్టం జరగకుండా కాలువల బాగుజేత చేపట్టామన్నారు. రహదారులను అభివృద్ధి చేశామని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే వివరించారు. రహదారుల సమస్యలను ప్రజలు తెలిపారు. అన్ని సమస్యలను నోట్ చేసుకుని పరిష్కరిస్తామని కుమార్ రాజా హామీ ఇచ్చారు. అనంతరం గృహాలను సందర్శించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, తహసీల్దార్ ఎం. కుసుమకుమారి, ఎంపీడీవో రవికాంత్, వ్యవసాయాధికారిణి శ్రీదేవి, పీఆర్ ఏఈ శరాబంది రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు, విద్యుత్ ఏఈ దేవదాసు, డాక్టర్ సాయిప్రసన్న, ఎంఈవో-1 వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 సురేష్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి వీరంకి పరశురామ్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కొల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి ఏడీఏకు సత్కారం

గుడివాడ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవిని ఎరువుల షాపు డీలర్లు, వ్యవసాయాధికారులు అగ్రి భవన్‌లో శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించారు. బదిలీపై వెళ్లిన ఏడీఏ రమాదేవిని గుడివాడ ఏడీఏ ఎస్.కవిత ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గుడివాడ, నందివాడ, పెదపారుపూడి మండలాల రైతులకు ఎంతో సేవలు అందించారని తెలిపారు. గుడివాడ, పెదపారుపూడి మండల వ్యవసాయ శాఖ అధికారులు బోలెం అనంతలక్ష్మీ, ఆంజనేయరావు, ఎరువుల షాపుల డీలర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఏఏలు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద వర్ధంతి

గుడివాడ : బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) ఆధ్వర్యంలో స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక నెహ్రూచౌక్‌లోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌కే మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ నలుమూలల వ్యాపింపజేసి భారతమాత కీర్తిని ప్రకాశింపజేసిన వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. ఆయన ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోనం గోపిక, లంకా రాంబాబు, చరణ్, సత్య, నేతాజీ, అత్తులూరి రవికరణ్ తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య వర్ధంతి

కూచిపూడి: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతిని ఆయన స్వగ్రామమైన భట్లపెనుమర్రులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, గ్రామసర్పంచ్ మట్టా ఇందిర, పంచాయతీ కార్యదర్శి వి.ప్రభు కుమార్, చందు, సతీష్, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 105, 113, 124
చికెన్ విత్ స్కిన్ 200
చికెన్ స్కిన్‌లెస్ 210
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 570



నేడు నగరంలో జగన్నాథ రథయాత్ర

మచిలీపట్నం టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని వాసవీదేవి గోశాల నిర్వాహకుడు వల్లపాటి సుబ్రహ్మణ్యం బిక్షులు పిలుపునిచ్చారు. శుక్రవారం జగన్నాథ మందిరంలో ఆహ్వానపత్రికలను ఆయన ఆవిష్కరించారు. నిజాంపేట బిక్షులి వేణుగోపాలస్వామి గుడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. శక్తిగుడి, రేవతిసెంటర్, కోనేరుసెంటర్, పోర్టు రోడ్డు, బుట్టాయిపేట, రామానాయుడుపేట, ఐదురోడ్ల సెంటర్ మీదుగా తిరిగి జగన్నాథ మందిరానికి యాత్ర చేరుకుంటుందని తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పాల్గొంటారని పేర్కొన్నారు. బృందావన్, మస్తోహనదాస్, శ్రీహరిదాస్ పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

● ముస్లిం పెద్దలతో ఎస్పీ ఆర్.గంగాధరరావు



కోనేరు సెంటర్‌లో దేవుళ్ళను ఏర్పాట్లపై డీఎస్పీ సీహెచ్ రాజాకు సూచనలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా ఆదివారం నగరంలో నిర్వహించే కార్యక్రమాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ముస్లిం పెద్దలకు ఎస్పీ ఆర్‌.గంగాధరరావు సూచించారు. కోనేరుసెంటర్‌లో చెక్ పోస్టింగ్ నిర్వహణపై ముస్లిం పెద్దలతో శుక్రవారం ఆయన చర్చించారు. జరీ పంజా, బార్ ఇమాం పంజాలను సందర్శించారు. ఎవరైనా శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీ సీహెచ్ రాజా, ఎస్బీ సీఐ శ్రీనివాసరావు, చిలకలపూడి, ఇనకుదురు, ఆర్‌పేట సీఐలు అబ్దుల్ నబీ, పరమేశ్వర్, ఏసుబాబు పాల్గొన్నారు.

80 శాతం హామీలు అమలు చేశాం

సుపరిపాలన కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు



అవనిగడ్డలో మహిళకు కరపత్రాలు అందిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు,



పెడన మొగ్గయ్య కాలనీలో ఇంటింటికీ పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

అవనిగడ్డ, జూలై 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాదిలో 80 శాతానికి పైగా హామీలను అమలు చేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని అవనిగడ్డలో కొనకళ్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను నాయకులు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, మాచవరపు ఆదినారాయణ, తలశిల స్వర్ణలత, ఆకుల సీతామహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం:

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన/బంటుమిల్లి: ప్రజా సమస్య పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పెడన మొగ్గయ్య కాలనీలో, బంటుమిల్లిలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలను పంచారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెడనలో యక్కల శ్యామలయ్య, హస్మి, ఖదీర్, అనుమల పూర్ణ, కమ్మగంటి బాబు, తమ్మా భీమయ్య, బంటుమిల్లిలో కూనపరెడ్డి వీరబాబు, నూర్, డీసీ చైర్మన్ బొర్రా కాశీ పాల్గొన్నారు.

3వ డివిజన్‌లో..

మచిలీపట్నం టౌన్: 3వ డివిజన్‌లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొరిపాటి గోపీచంద్ పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ ఇంగ్లీషుపాలెంలో పర్యటించారు.

డిమాండ్లు ఆమోదించండి



డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

అవనిగడ్డ, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని అవనిగడ్డ డిపో గ్యారేజ్ వద్ద భోజన విరామ సమయంలో కార్మికులు ధర్నా చేశారు. ఔట్‌సోర్సింగ్ పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని, ఆర్టీసీలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, సొంతంగా ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయాలని, నిర్వహణను ఆర్టీసీకే అప్పగించాలని, పెండింగ్ డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు ఎండీ ప్రసాద్, ఎస్ఎస్ నారాయణ, ఏజే రత్నాకర్, డీఎస్ రావు, ఎస్ఎస్ రావు, బీవీఎల్ ప్రసాద్, మహేష్, డిపో, గ్యారేజ్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ కిందకు దూసుకెళ్లిన స్కూటీ

● ఆక్యాతమ్మకు తీవ్ర గాయాలు

చల్లపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): హైవే ఎక్కుతున్న సమయంలో స్కూటీ అదుపుతప్పి లారీ కిందకు దూసుకెళ్లిన ఘటనలో స్కూటీపై ఉన్న ఆక్యాతమ్మకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన చల్లపల్లి-పెదకళ్లేపల్లి రోడ్డులో హైవేపై శుక్రవారం ఉదయం జరిగింది. మాజేరుకు చెందిన నాగలక్ష్మి, నూతనకుమార్ ఆక్యాతమ్మకు, చల్లపల్లి వచ్చి పెదకళ్లేపల్లి రోడ్డుమీదుగా హైవేపైకి వెళుతున్నారు. స్పీడ్‌బ్రేకర్ ఎక్కి హైవేపైకి చేరుతున్న సమయంలో స్కూటీ అదుపుతప్పి రోడ్డుకు అవతలివైపునకు దూసుకువెళ్లింది. అదే సమయంలో బందరువైపుగా వస్తున్న లారీ డ్రైవర్ గమనించి బ్రేక్ వేశాడు. లారీ ముందుభాగాన్ని స్కూటీ ఢీకొని లారీకిందకు వెళ్లింది. ఆక్యాతమ్మకు తలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సలు చేశాక మెరుగైన చికిత్స కోసం బందరు తీసుకెళ్లారు. పోలీసులు ఘటనా ప్రదేశానికి వెళ్లి వివరాలు సేకరించారు.



అవనిగడ్డలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



మణేశ్వరంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



మచిలీపట్నంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తదితరులు



అవనిగడ్డలో ఆర్యవైశ్య నేతలతో కలిసి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

పేదల పెన్నిధి వీఎం రంగా

● ఘనంగా జయంతి కార్యక్రమాలు

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్/కోడూరు/నాగాయలంక/చల్లపల్లి/పెడన/బంటుమిల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా పేదల పెన్నిధి అని పలువురు నేతలు, అభిమానులు కొనియాడారు. శుక్రవారం రంగా జయంతిని వాడవాడలా ఘనంగా జరుపుకొన్నారు. మచిలీపట్నం రేవతిసెంటర్‌లోని రంగా విగ్రహానికి డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జనసేన నాయకుడు గడ్డం రాజు తదితరులు నివాళులర్పించారు. గోడ కూడలిలో కాలు కోల్పోయిన బోయిన రామాంజనేయులుకు ఎన్ఆర్‌వి చలమలశెట్టి బాలాజీ అందించిన త్రిచక్ర వాహనాన్ని బండి రామకృష్ణ అందజేశారు. కానూరులో రంగా విగ్రహానికి తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ నివాళులర్పించారు. అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రి వద్ద రంగా విగ్రహానికి రాధా-రంగా మిత్ర మండలి సభ్యుడు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రక్తదాన శిబిరాన్ని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. అవనిగడ్డ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఏపీ అగ్నికుల క్షత్రియ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, తుర్లపాటి కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, రాధా-రంగా మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నివాళులర్పించారు. టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, దివంగత మాజీ ఎమ్మెల్యే వీఎం రంగా జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అల్లూరి, వంగవీటి చిత్రపటాలకు నాయకులు నివాళులర్పించారు. మోదుమూడిలో రంగా విగ్రహానికి యాసం చిట్టిబాబు, గుడివాక శివరావు, బచ్చు రమానాథ్, బచ్చు నరసింహారావు నివాళులర్పించారు. వంతెన సెంటర్‌లో రంగా విగ్రహానికి కాంగ్రెస్ నాయకుడు ఆది రామ్మోహనరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అశ్వారావుపాలెంలో యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో మామిడి మొక్కలను పంపిణీ చేశారు. సర్పంచ్ వండ్రాజు లంకమ్మ ప్రసాద్ పాల్గొన్నారు. జనసేన నాయకుల ఆధ్వర్యంలో కోడూరు ప్రధాన సెంటర్, తుర్లు వైపు, ఉల్లిపాలెం సెంటర్లలో రంగా విగ్రహాలకు నివాళులర్పించారు. డి.వెంకటేశ్వరరావు, మర్రె గంగయ్య, బచ్చు వెంకటేష్, ఉల్లి శేషగిరిరావు, కోట రాంబాబు, కొండవీటి సునీత పాల్గొన్నారు. నాగాయలంకలో రంగా విగ్రహానికి డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మండ లక్ష్మణరావు, తలశిల వెంకట నరసింహారావు, అంబటి శ్యామ్ ప్రసాద్, కనగాల రాధ నివాళులర్పించారు. నంగేగడ్డ, మర్రిపాలెం, టికొత్తపాలెం గ్రామాల్లోని రంగా విగ్రహాల వద్ద కూటమి నేతలు జయంతి నిర్వహించారు. చల్లపల్లి పడమటిపాలెంలోని రంగా విగ్రహానికి మంటసాల ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ నివాళులర్పించారు. టీడీపీ సేత రవి రాజేశ్వరరావు, జనసేన నేతలు కొండవీటి వీరబాబు, ఆదపా రాంబాబు, గుంగిశెట్టి రాజేంద్ర, మడమల రంజిత్, ఆడపా రవి పాల్గొన్నారు. పెడన తోటమూల దోలివాడలో వీఎం రంగా విగ్రహానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నివాళులర్పించారు. కాపు యువత పాల్గొన్నారు. వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో రంగా చిత్రపటానికి నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము నివాళులర్పించారు. మణేశ్వరంలో రంగా విగ్రహానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నివాళులర్పించారు. కూనపరెడ్డి వీరబాబు, బొర్రా కాశీ, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు రోశయ్య

అవనిగడ్డ/చల్లపల్లి/పెడన/బంటుమిల్లి/నాగాయలంక, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఆర్థిక శాఖ మంత్రిగా రాష్ట్రాభివృద్ధికి కొణిజేటి రోశయ్య అవిరళ కృషి చేశారని, ఆయన చిరస్మరణీయుడని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. రోశయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ ఫైర్ స్టేషన్ సమీపంలోని రోశయ్య విగ్రహానికి ఆర్యవైశ్య నేతలతో కలిసి ఎమ్మెల్యే మన నివాళులర్పించారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు మం టసాల రాజమోహనరావు, నంబూరి వెంకటేశ్వరరావు, దేసు జగన్మోహనరావు, అద్దేపల్లి వెంకటేశ్వరరావు, నంబూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. చల్లపల్లిలో రోశయ్య చిత్రపటానికి ఆర్యవైశ్యసంఘ ప్రధాన కార్యదర్శి వరదా హరిగోపాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మీర్ రిజ్వాన్ నివాళులర్పించారు. జగదరపు బాబూరావు, కొండేటి భాస్కరరావు, అన్వర్ బాషా పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘ భవనంలో రోశయ్య చిత్రపటానికి నంబూరి మండల అధ్యక్షుడు బొగ్గవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి నివాళులు అర్పించారు. సంఘ పెద్దలు జూపూడి సాయి, జల్లూరి ప్రసాద్ పాల్గొన్నారు. పెడన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆర్యవైశ్య ప్రముఖులు కొండ్రు చిన్నా, మామిడి ప్రసాద్ పాల్గొన్నారు. మణేశ్వరం రాజులపేటలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నివాళులర్పించారు. నాగాయలంక వృద్ధాశ్రమంలో వృద్ధులకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అవనిగడ్డ విభాగం తరఫున జిల్లా వైస్ ప్రెసిడెంట్ విస్సంశెట్టి శ్రీనివాస్, అవనిగడ్డ విభాగ అధ్యక్షుడు కొల్లివర రాధాకృష్ణ భోజనం అందజేశారు. దేసు వెంకట శేషగిరిరావు-జానకి దంపతుల కుమార్తె, దుబాయ్ వాస్తవ్యుడు దేసు వినోద్ నిత్యావసర సరుకులను వితరణగా ఇచ్చారు.

ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు తనిఖీ

చల్లపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): కండిషన్‌లో ఉన్న బస్సులనే ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు నడపాలని, విద్యార్థుల రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రవాణాశాఖ మచిలీపట్నం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) జె.నారాయణస్వామి సూచించారు. శుక్రవారం ప్రధాన సెంటర్లో సిబ్బందితో కలిసి ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను ఆయన తనిఖీ చేశారు. వాహనాల స్థితిని, డ్రైవర్ అర్హతలను పరిశీలించారు. నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

కృత్తివెన్ను, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన దూసనపూడి రాంబాబు తీవ్రంగా గాయపడ్డారు. ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.05 లక్షల చెక్కును ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తన నివాసంలో రాంబాబు భార్యకు శుక్రవారం అందించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, చేకూరి వెంకట్రావు, టీడీపీ బంటుమిల్లి మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ

పెడన, జూలై 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై రిసోర్సు పర్సన్లు(ఆర్పీలు) ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో పట్టణ పరిధిలోని 25 మంది ఆర్పీలకు ఆయన ట్యాబ్‌లు అందజేశారు. అనంతరం ఆరోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

మత్స్యకార సహకార సంఘం పెడన అధ్యక్షుడిగా బొడ్డు తాతయ్య



పెడన, జూలై 4(ఆంధ్రజ్యోతి): మత్స్యకార సహకార సంఘం పెడన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు బొడ్డు తాతయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని చేపల మార్కెట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తాతయ్య తెలిపారు. ప్రతి శుక్రవారం పెడనలో నిర్వహించే సంతలో చేపలు, రొయ్యల విక్రయించేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చే మత్స్యకార మహిళలకు అన్ని సదుపాయాలతో కూడిన షెడ్ల నిర్మాణం జరిగేలా చూస్తానన్నారు. తాతయ్యను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అభినందించి సత్కరించారు.

అక్కుమహంతి రాజాకు మాతృ వియోగం



అక్కుమహంతి లక్ష్మి(ఫైల్)

మచిలీపట్నం టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ శిష్టకర్ణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ అక్కుమహంతి రాజా తల్లి లక్ష్మి(80) శుక్రవారం అనారోగ్యం కారణంగా మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు అక్కుమహంతి రాజా కాగా, రెండవ కుమారుడు చలపతిరావు హైదరాబాద్‌లో పోలీసుశాఖలో పనిచేస్తున్నారు. హౌసింగ్‌బోర్డులోని వారి నివాసంలో లక్ష్మి భౌతిక కాయాన్ని టీడీపీ నాయకులు గొరిపాటి గోపీచంద్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, పిల్లలు నాగరాము, మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పీ-4 కార్యక్రమాలు రూపొందించండి

● అధికారులతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జూలై 4(ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో 9 వేల కుటుంబాలను అభివృద్ధి పథంలో నడపాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, సుస్థిర అభివృద్ధి పథాలు అందేలా కార్యక్రమాలు రూపొందించాలని అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి పీ-4 విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ప్రత్యేకాధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీడీఓలు తుంగల సుమలీదేవి, కోట విజయ రాధిక, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఎంపీడీవోలు సుధా ప్రవీణ్, మరియదేవి, ఇతర మండలాల అధికారులు పాల్గొన్నారు.

గుండేరు కరకట్టల అభివృద్ధి పనులు ప్రారంభం

ఘంటసాల, జూలై 4(ఆంధ్రజ్యోతి): బిరుదుగడ్డ నుంచి దాలిపర్రు వరకు రూ.48 లక్షలతో 3.2 కిలోమీటర్ల మేర గుండేరు కరకట్టల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. చిల్లలవాగు కుడి కట్ట బలహీనంగా ఉండటంతో డ్రెయిన్‌లోని నీరు పొంగి పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయని కట్టను బలపర్చాలని ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మంగళాపురం నుంచి ఐదు రోడ్ల వరకు ఏడాది కట్ట కోతకు గురైతే తామే పూడ్చుకున్నామని, బలోపేతం చేయాలని వారు ఎమ్మెల్యేకు వివరించారు. కట్టలను అభివృద్ధి చేస్తామని రైతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, నీటి సంఘం అధ్యక్షుడు నిమ్మగడ్డ నిరీక్షణబాబు, సర్పంచ్ నేలపతి, బండి వరలక్ష్మీవరరావు, వీరమాచినేని భవానీప్రసాద్, డ్రెయినేజీ డీఈ జె.బాబూనాయక్, ఏఈఈ చిరంజీవి పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె



లక్ష్మీపురం లక్ష్మీనాంచారమ్మ ఆలయానికి సారె తెచ్చిన మహిళలు

కోడూరు/చల్లపల్లి/నాగాయలంక, జూలై 4(ఆంధ్రజ్యోతి): అమ్మవార్లకు శుక్రవారం భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు. విశ్వనాథపల్లిలో అద్దంకి నాంచారమ్మకు గ్రామానికి చెందిన నాయిబ్రాహ్మణులు సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలయ ఈవో జయశ్రీ పర్యవేక్షించారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురంలోని బాలా త్రిపురసుందరి సహిత లక్ష్మీనాంచారమ్మకు మేళతాళాలతో మహిళలు సారెను తీసుకొచ్చి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. దాలిపర్తి నారాయణరావు, ఎం.కుటుంబరావు, శ్రీనివాసరావు, డి.సుబ్బారావు, కనగాల రాధాకృష్ణ పర్యవేక్షించారు. పురిటిగడ్డ శ్రీపోలేరమ్మ, రాంబ అమ్మవారికి, వాసవీ కన్యకా పరమేశ్వరికి ఆషాఢ సారె సమర్పించారు. బావదేవరపల్లిలో ఉర్వేశ్వమ్మ అమ్మవారికి గణపతి అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం నుంచి ఎడ్ల బండ్లపైన ఊరేగింపుగా సారె తీసుకెళ్లి సమర్పించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధి, ఆలయ ధర్మకర్త పూషడపు నిరంజనరావు, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ దంపతులు పాల్గొన్నారు.

700 మంది విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు



కొడాలిలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సచివాలయ సిబ్బంది

మచిలీపట్నం టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అమరావతి కంటి ఆస్పత్రి, ఆవిల్ దంత వైద్యశాల, ఈయర్‌హాల్ ఆధ్వర్యంలో 700 మంది విద్యార్థులకు ఉచితంగా నేత్ర, దంత, వినికిడి పరీక్షలు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డి.ఆశాలత ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

పోరాట యోధుడు అల్లూరి

ఘంటసాల/చల్లపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట యోధుడు అని పలువురు కొనియాడారు. శుక్రవారం జయంతి సందర్భంగా కొడాలి పంచాయతీ కార్యాలయం వద్ద అల్లూరి చిత్రపటానికి పంచాయతీ కార్యదర్శి సీహెచ్ చేవేన నాగమణి, సచివాలయ ఉద్యోగులు నివాళులర్పించారు. అల్లూరి చిత్రపటానికి ఘంటసాల పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి జయలక్ష్మి, చినకళ్లేపల్లిలో సర్పంచ్ గుత్తికొండ రామారావు, కార్యదర్శి అబ్దుల్ నయూమ్, చిట్టూర్పు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి శ్రీలక్ష్మి కృష్ణవేణి నివాళులర్పించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నవీన్, రేవతి, యశ్వంత్‌కుమార్, కృష్ణవేణి పాల్గొన్నారు.

చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో..

స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని, జాతీయకవి రావిశాస్త్రి పింగళి వెంకయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. అల్లూరి, రోశయ్యల చిత్రపటాలకు, పింగళి వెంకయ్య విగ్రహానికి గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పీవీ మాధవేంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్, పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు నివాళులర్పించారు.

పంట కాలువల పూడికతీత

మచిలీపట్నం టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): చిట్టిపాలెం, హుస్సేన్‌పాలెం ప్రాంతాల్లో భారీ వర్షాల సమయంలో పొలాలు ముంపునకు గురై పంట నష్టపోతున్నామని, కాలువల పూడికతీయించాలని రైతులు గణేష్, ఉపేంద్ర గురువారం మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పూడిక తీయించాలని ఎంపీడీవో సీహెచ్ వెంకటేశ్వరరావుకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం రూ.50వేల గ్రామపంచాయతీ నిధులతో ఎంపీడీవో పంట కాలువల పూడికతీత పనులు ప్రారంభించారు. నీటి సంఘం నాయకుడు ఉపేంద్ర, టీడీపీ నాయకుడు గణేష్, గ్రామపెద్దలు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సమ్మెనోటీసు అందజేత

చల్లపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 9వ తేదీన చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనేందుకు సహకరించాలని పురిటిగడ్డ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.విజయరాఘవ్‌కు ఆశా కార్యకర్తలు శుక్రవారం సమ్మెనోటీసు అందించారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, యూనియన్ నాయకులు ప్రశాంతి, లలిత, సీతారావమ్మ, కిరణ్మయి పాల్గొన్నారు.



